POSTAL REGD.NO.PRAKASAM/16/2024-2026
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
జూలై 2025
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 43 సంచిక: 03



## శ్రీ గురుపూర్ణిమ

జూలై 10, 2025

# ఈ నెల పండుగలు

జూలై 04 - శ్రీ వివేకానంద స్వామి ఆరాధన
జూలై 10 - శ్రీ గురుపూర్ణిమ
జూలై 22 - శ్రీ వివేకానంద స్వామి ఆరాధన (తిథి-ఆషాడ బహుళ త్రయోదశి)



# శుభ చింతనలకు చెలికాడు ఓరిమి!

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

సహజంగా మానవులందరికీ జన్మించిన నాటినుండీ మొదట తిండి, గుడ్డ, యిల్లు మొదలైన జీవనాధారాలనుసాధించుకోవడంతప్పదు. కానివారికృషి వాటిని సాధించడంతో అంతమొందదు. అంతకంతకూ మానవుడు తన జీవనాన్ని, తనవారి జీవనాన్ని మరింత సుఖంగా గడిచేలా చూచుకోడానికి ప్రాకులాడుతాడు. ఈ సుఖమనే దానికి ఒక స్పష్టమైన నిర్వచనము, కొలబద్దలూ లేవు. ఎంత సాధించినా కొరవు కన్పిస్తూనే వుంటుంది. ప్రతి సుఖాన్ని సాధించుకోడంలోనూ కొంత దుఃఖము, కష్టమూ యిమిడియున్నాయి. కనుకనే ప్రతి అరచేయి తన వెనుకవైపును స్పర్శించే యత్నంలా సుఖం కోసం చేసే ప్రతి యత్నమూ ఆత్మ విఘాతంగా పరిణమిస్తుంది. అయినా యిందుకు కారణాన్ని, పరిష్కారాన్ని గూర్చి ఆలోచించకుండానే అందరూ యీ విషయంలో పరిభ్రమిస్తూండడమే సామాన్యజీవుల కథ. ఈ యత్నంలో క్రమంగా మానవుడు సాటి జీవుల సుఖ శ్రేయస్సులను గూడా గుర్తించి గౌరవించక, వాటిని గూడ బలిచేయడానికి వెనుకాడడు. అదే ప్రపంచంలోని చెడుకంతటికీ మూలం.

ఈ ప్రాకృతికమైన మానవజీవిత సమస్యను నిశితమైన లోచూపుతో పరిశీలించి, విశ్లేషించి, పరిష్కార మార్గాన్నన్వేషించే వ్యక్తులు కొందరెప్పుడూ చరిత్రలో జన్మిస్తూనే వచ్చారు. వీరిలో కొందరు కృతార్థులై యిట్టి చింత, భయాలూ లేక ఆనందంగా జీవించగలగడం వారి జీవిత విధానం చూస్తే తెలుస్తూనే వుంటుంది. అన్ని మతాలకు చెందిన మహనీయులూ యిట్టివారే. వీరు సాటివారిపట్ల అపారము, నిర్హేతుకమూ అయిన ప్రేమచేత తాము సాధించిన శాంతిమార్గాన్ని బోధిస్తారు. వేదఋషులు, బుద్ధుడు, క్రీస్తు యిట్టివారే. గురునానక్, రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి, శిరిడీ సాయిబాబా యిలాంటివారే.

ఇలాంటి మహనీయుల బోధ వినేవారి మనస్తత్వాన్ని, అవసరాన్ని అనుసరించి అనేక విధాలుగా వుంటుంది. ధృఢమైన మనస్సు, యోచన గల తీవ్రస్వభావులకు జ్ఞానమే మార్గం.

పై చెప్పిన మహనీయులు తమ తత్త్వాన్నెలా విశ్లేషించి అన్వేషించుకొన్నారో గమనించాక, తామూ అలానే చేసి అట్టి జ్ఞానాన్ని పొందుతారు. కాని అలా మన యత్నం సఫలంగావాలంటే రెండు షరతులున్నాయి: (1) మనకు బోధించేవారు అనుభవజ్ఞులై వుండాలి. వారి సాన్నిధ్యంచేతనే మన మనస్సు ప్రశాంతము, శుద్ధము అవడం ఒక కొలబద్ద. భగవద్గీతాది గ్రంథాలలో చెప్పబడిన స్థితప్రజ్ఞుడు, జ్ఞానుల లక్షణాలు వారి నిత్య జీవితవిధానాలలో కనిపించడం మరొక కొలబద్ద. వీటిని బట్టి వారిని గుర్తించాలి. వారి అనుభవాలు అనాదిగా వివిధ మతాల చరిత్రలలో యిదివరకు పూర్ణ జ్ఞానాన్ని పొంది శాస్త్ర గ్రంథాలలో మానవులకొరకు పొందుపరచబడ్డ అనేకమంది జ్ఞానానుభూతికి సరిపోవాలి.

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:43 జూలై - 2025 సంచిక:03

**పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"**

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | శుభ చింతనలకు చెలికాడు ఓరిమి! | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 06 |
| 03. | 'భగవంతుడు మనలను ఎలా వుంచితే అలా వుండాలి' | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 08 |
| 04. | మాతృదేవి స్మృతులు | శ్రీ థామస్ రెడ్డి | 11 |
| 05. | మాతృదేవి చతుర్థ ఆరాధనా మహోత్సవము | శ్రీమతి టి. పద్మావతి | 13 |
| 06. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 17 |
| 07. | బుద్ధ ధ్యాన హృదయము | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 22 |
| 08. | భగవాన్ శ్రీ భరద్వాజ | శ్రీమతి శ్రీదేవి | 23 |
| 09. | శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు | శ్రీమతి శ్రీదేవి | 24 |
| 10. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీ శివకుమార్ | 25 |
| 11. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీమతి హేమ | 27 |


**చిరునామా**

Sri Manga Bharadwaja Trust,
Kondaiah Bunk Street, Kothapeta,
Ongole, Prakasam District, A.P. - 523002
Phone No. 08592 233271

**www.saibharadwaja.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

**చందా వివరములు**

విడి ప్రతి : ₹ 10-00

సంవత్సర చందా : ₹100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

అంటే స్వానుభవం దృష్ట్యా శాస్త్ర గ్రంథాలను ఎవరి మనస్తత్వానికి పరిపాకానికి తగినరీతిన వారికి బోధించగల శాస్త్రజ్ఞానంగూడ గురువులో వుండాలి. అంతేకాదు ఇటువంటి గురువులు చాలా అరుదు. వారిని వెదికి పట్టుకోటానికి ఓరిమి, బుద్ధిశక్తి అన్వేషికి వుండాలి. ఇది చాలదు అన్నట్లు అన్వేషించేవాడిలో ఏమాత్రం కీర్తికాంక్ష, అహంకారము, అభిమానము, అసూయాదులు మిగిలియున్నా, అవి విజృంభించి గురువునెన్నిక చేయడంలో తప్పక పొరబడేలా చేస్తాయి. ఇలాంటి వారు చిరకాలం ఏ ఒక్క గురువునూ నమ్మి సేవించలేరు. అంటే జీవితం గూర్చి చక్కగా యోచించి సరైన జ్ఞానం లేక మానవుడు శాంతిని పొందలేడని గుర్తించి అన్యవిషయాలమీద వ్యామోహం పూర్తిగా విడిచిన వారుదప్ప ఇతరులు సద్గురువు లభించినా శ్రేయస్సును సాధించలేరు. ఇది జ్ఞాన మార్గము.

(2) అంతటి పూర్ణుడైన గురువు దొరికాక తిరిగి సృష్టియొక్క, తనయొక్క తత్త్వాన్ని పరిశీలించకనే వారు చెప్పినది పూర్ణమైన విశ్వాసంతో, వారిచ్చిన అవగాహనతో పాటిస్తూ, ఓరిమితో ఫలితం లభించేదాకా విడువక సాధన చేయడమే. ఇదే భక్తి మార్గం. ఎక్కువమందికి యిదే సాధ్యం. ఈ మార్గంలో గురువు యొక్క జ్ఞానస్థితిని ఏమారని శ్రద్ధాభక్తులు, ఓరిమి అత్యవసరం.

ఈ రెండు మార్గాలలోను సాఫల్యానికి ఆవశ్యకమైన అంశాలు :

(1) జీవితాన్ని చక్కగ గమనించి, యోచించి, ఆధ్యాత్మ వికాసం తప్ప, శాంతికి మార్గం లేదన్న గుర్తింపు సాధకునిలో ధృఢంగా వుండాలి. దీనిని వివేకము, ముముక్షుత్వమూ అంటాము. తిండి, గుడ్డ వంటి జీవితావసరాలను జీవించడానికవసరమైనంత మేరకు సాధించుకుంటూ, తక్కిన తన శక్తినీ విరామాన్నీ, ఆసక్తినీ ఆత్మవికాస అన్వేషణకు అంకితం చేయాలన్న ధృఢ నిశ్చయం.

(2) తనకు హస్తగతంగాని ఆత్మజ్ఞానాన్ని సాధించే మార్గంలో గూడ తన స్వంత అభిప్రాయాలు, యిష్టాయిష్టాలు లేకుండడం.

కాని ఎక్కువమంది సాధకులు దెబ్బతినడానికి ప్రధాన కారణం వారు సద్గురువుల కీర్తిని చూచి ముగ్ధులై, అట్టి జ్ఞానాన్ని సాధించకనే అట్టి కీర్తిని సాధించాలన్న చాపల్యం కలిగివుండటం. తాము తరించక ముందు లోకాన్ని తరింపచేయ బూనుకునే వీరు తాము భ్రష్టులవడమేగాక అమాయకులైన అనేకమందిని భ్రష్టుల్ని చేస్తారు. తమ కువ్యాఖ్యానాలతో నిర్దుష్టమైన ఆధ్యాత్మిక విద్యను గందరగోళంచేసి అన్వేషకులకు ఎన్నో సందేహాలను, వికల్పాలనూ కల్పిస్తారు. వంటరానివారు వంట చేస్తామని వంటింట్లో చేరినట్లు, అందువలన వంటకాలు వృధా అవుతాయి: ఏ వస్తువులనెలా, ఎక్కడ సర్దాలో తెలియక చక్కగా అమర్చుకున్న వస్తువులను అస్తవ్యస్తం చేయడం ద్వారా అటు తర్వాత చక్కగా వంట చేయగలవారు వచ్చినా ఏ వస్తువూ అది వుండవలసిన స్థానంలో వుండదు. వారి వంట తినినవారి నోళ్ళు చెడుతాయి. తర్వాత మంచి వంటకాన్ని గూడ తినలేరు. సరిగదా, వారి ఆరోగ్యాలు గూడ తారుమారవుతాయి! అందుకే తాను తరించకనే యితరులను తరింపచేయ పూనుకోవడం నరకహేతువని పెద్దలు చెప్పారు. వైద్యం నేర్వకనే చికిత్సకు పూనుకోవడంలాగ!

ఇలాంటి పరిపాకంలేని ఆధ్యాత్మ ప్రచారకులను జాగరూకతతో గుర్తించి వారినుండి తొలిగిపోవడం తెలియకుంటే వైద్యం నేర్వని దొంగ వైద్యుని ఆశ్రయించిన అమాయకుల గతే మనకూ పడుతుంది. చరిత్రలో మతజీవితంలోనూ, ఆధ్యాత్మిక మార్గంలోనూ ఎంతో అస్తవ్యస్తమేర్పడింది. శివ కేశవ భేదాలు, ద్వైతాద్వైత విశిష్టాద్వైతాది ద్వేషాలు, మత కలహాలు యివన్నీ యిట్టి నకిలీ గురువుల ప్రతిభలే. ఇట్టి వారి వలన శుద్ధమైన ఆత్మవిద్య కలుషితమౌతుంది. వ్యక్తికి విశాలమైన మానవతా దృక్పథం ఏర్పడేబదులు సంకుచిత తత్త్వము, మమకారము, ద్వేషమూ మతం ముసుగు వేసుకుని మనకు తారసిల్లుతాయి. అనివార్యంగా యిట్టి ధూర్తుల వలన చరిత్రలో ఆత్మవిద్య కలుషితమవుతూనే వుంటుంది. గనుక నిర్దుష్టమైన ఆత్మవిద్యను తిరిగి తెల్పగల శ్రీ సాయిబాబా

***మిగతా 10వ పేజీలో***

# పరిప్రశ్న

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

**ప్రశ్న :- శ్రీ గురుచరిత్రలో ఒక ముఖ్యమైన ప్రశ్న ఉదయిస్తుంది. ఒకసారి వేదధర్మునికి ప్రారబ్దవశాన మతి స్థిమితము తప్పినదని, వేరొకచోట ఆయనకు ప్రారబ్దమేలేదని, కాశీ ప్రభావాన్ని తెలపడానికి మాత్రమే ఆ ఋషి ఆ బాధలు కల్పించుకున్నారని వ్రాయబడింది. దీని సమన్వయమేమి ?**

**- అ. ఉమా మహేశ్వరరావు**

**జవాబు :-** ప్రారబ్దమున్నంతవరకే దేహం నిలుస్తుందనీ, కనుక జీవించియుండగానే ముక్తి ఎన్నటికీ సాధ్యంగాదని ఒక సిద్ధాంతమున్నది. దానికి సమాధానం శ్రీ రమణమహర్షి యిలా చెప్పారు – ఒకడు మరణిస్తే అతడి ముగ్గురు భార్యలు విధవలైనట్లు, జీవభావం నశిస్తే అట్టి జ్ఞానికి సంచితము, అగామి, ప్రారబ్ధములను అనుభవించే జీవుడే వుండడు. కనుక జీవన్ముక్తి సంభవము. లోకుల దృష్టిలో మాత్రమే అతడికి దేహము, ప్రారబ్దము వున్నవని చెప్పవలసి వుంటుంది. ప్రారబ్దవశాన వేదధర్మునికి మతి స్థిమితం తప్పినదని లోకుల దృష్టినుండి మొదట చెప్పడం జరిగింది. బ్రహ్మజ్ఞాని అయిన ఆ మహర్షి దృష్టిలో మాత్రం అది వాస్తవం కాదని రెండవ వాక్యానికి అర్థం. ●


---

**ప్రశ్న :- మా అమ్మ ఎంతో భక్తితో దైవాన్ని పూజిస్తున్నా మా నాన్న చనిపోయారు; ఎన్నో కష్టాలు సమస్యలు ఆమె ఎదుర్కోవలసివస్తున్నది. ఎందువలన ?**

**- పి. వైదేహి, 10వ తరగతి, మైలవరం**

**జవాబు :-** భగవంతుడు సృష్టి మొదట్లో అందరిని సుఖసంతోషాలతో సృష్టించాడు. అలానే ఎన్ని జన్మలైనా కొనసాగటానికిగాని, యిష్టముంటే భగవంతునిలో ఐక్యమవడానికిగాని, ఎలా ధర్మంగా మంచిగా బ్రతకాలో తెల్పగల ఋషులద్వారా వేదాలు, శాస్త్రాలు యిచ్చాడు. దానిని ఆచరించకపోతే వచ్చే

ప్రమాదాలు గురించి తెల్పే గ్రంథాలు కూడా వారి ద్వారా ప్రసాదించాడు. వాటిని అర్థం చేసుకొని మనం ఆచరించి బాగుపడడానికి, లేక వాటిని ఉల్లంఘించి పాపము, దాని ఫలితమైన దుఃఖమూ కొనితెచ్చుకునేందుకుగాని స్వేచ్ఛ నిచ్చాడు. ఆ స్వేచ్ఛ లేకుంటే మనిషి యంత్రంలా అవుతాడు. ఇక జ్ఞానమూ, ముక్తి, దైవత్వమూ వాటికి వీలవ్వవు. స్వేచ్ఛ వుండి దానిని దుర్వినియోగం చేసుకొనకుండడం నేర్చుకోగల్గాలనే జీవులను సృష్టించాడు. అన్నీ తెలుసుకొని బిడ్డలు తమకు తామే స్వతంత్రంగా, మంచిగా జీవించే వ్యక్తులవ్వాలనేగదా ఏ తల్లిదండ్రులైనా కోరేది? అందరికీ తల్లీ, తండ్రి, గురువు అయిన దైవమూ అలానే కోరుతాడు. కాని మనుషులు యీ స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకొని ఇంద్రియ సుఖాలకు, స్వార్థానికి బానిసయై రాగద్వేషాల వలన పాపాలు ఎన్నో జన్మలుగా చేస్తూ దుఃఖాన్ని పెంచుకొని బాధలు పడుతున్నారు. ఎన్నో తప్పులు చేశాక భగవంతుణ్ణి ప్రార్థించినంత మాత్రాన ఆ పాపఫలితంనుండి రక్షిస్తే ఇక జీవులన్నీ పాపాలు చేసి శిక్ష అనుభవించవలసినపుడు మాత్రం ఆశతో దైవాన్ని ప్రార్థించరా? ఇక ధర్మం ఆచరించి దైవాన్ని చేరుకుంటారా? కష్టపడి ధర్మం ఆచరించేవారికి, ఆచరించనివారికి ఒకే ఫలితం వుండటం న్యాయమా? నీవు కష్టపడితే వచ్చినన్ని మార్కులు ఏమీ చదవకుండా సలాము మాత్రం కొట్టినవాళ్ళకు కూడా నీతో



సమానంగా మార్కులు వస్తే నీకెలా వుంటుంది? అందువలన అమ్మకు గాని ఇతరులకు గాని కొంతైనా దుఃఖం, జీవితంలో తప్పడంలేదు. అయితే దేవుణ్ణి ప్రార్థించడం ఎందుకు అనకూడదు. ఇదంతా అర్థం చేసుకొని ప్రార్థిస్తుంటే యికముందైనా ఎన్ని కష్టాలు వచ్చినా రాముడు, హరిశ్చంద్రుడు వలె మనం కూడా ధర్మాన్ని అనుసరిస్తూ వెనుక చేసినవాటిని ఓర్పుతో, పశ్చాత్తాపంతో, నిజాయితీతో అనుభవించి పాపాన్ని కడిగేసుకోగల్గుతాము. అప్పుడు దైవాన్ని చేరుకుంటాము. ఇవన్నీ నేను వ్రాసిన గ్రంథాలలో వున్నాయి. కనుక మీ చదువులు చెడకుండా చూచుకొంటూ, నా రచనలన్నీ చదివాక వాటిలో మీకు తీరని సందేహాలుంటే నాకు వ్రాయాలి. లేకుంటే నేనింకా క్రొత్త గ్రంథాలు వ్రాసేందుకు తీరిక వుండదుగదా? సెలవులలో 'మతం ఎందుకు?' మొదలయిన గ్రంథాలు అనేకసార్లు చదివేసి ఆలోచించాక సందేహాలు అడగండి. శ్రీ సాయి మీకు చక్కని బుద్ధి శక్తిని ప్రసాదింతురుగాక!

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా *l***
**ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వ దర్శినః *ll***

(అక్టోబర్ 2009 సాయిబాబా మాసపత్రిక నుండి)

# ‘భగవంతుడు మనలను ఎలా వుంచితే అలా వుండాలి’

**పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ**

ప్రతి మానవుడు ఎక్కడో ఒక చోట, ఎవరికో ఒకరికి ఏదో ఒక పరిస్థితిలో పుడుతూ వుంటాడు. ప్రతివారూ ఏదో ఒకరకమైన అవయవ నిర్మాణంలోనూ, ధనికుల కుటుంబంలోనో లేక దారిద్ర్యపు కుటుంబంలోనో, మరేదో వివిధ స్థితిగతులలో వున్న కుటుంబాలలోనో జన్మిస్తూ వుంటారు. జన్మించిన ప్రతి మానవుడూ సుఖదుఃఖాలను అనుభవిస్తూ వుంటాడు. ఎంతటి ధనవంతుడికైనా కొన్ని దుఃఖపడే పరిస్థితులు వుంటాయి. అలాగే కటిక దరిద్రుడికైనా సంతోషకరమైన పరిస్థితులు వుంటాయి. అయితే ఎవరూ కూడా అవి వచ్చినపుడు వాటిని అనుభవించి వూరుకోరు. కష్టం కలిగినపుడు ఆ కష్టాలనుంచి తప్పుకోవాలని, సుఖాలు కలిగినపుడు యింకా యింకా సుఖపడాలని కోరుకుంటూనే వుంటారు. ఇది మానవ సహజగుణం. అయితే ‘భగవంతుడు మనలను ఎలా వుంచితే అలా వుండాలి’ అంటే ఏమిటి? ‘మనలను ఆయన ఎలా వుంచితే అలానే వుంటున్నాము గదా! వుండక ఏంచేస్తాం? తప్పక వుండవలసిందే!’ అనవచ్చు. అంటే మనకు ధనము-దారిద్ర్యము, ఆరోగ్యము-అనారోగ్యము, మన సంతానము, జీవితంలో సంభవించే అనేక సంఘటనలు; ఇలా ఏవి ఎలా ప్రాప్తిస్తే అలా వుండక తప్పదు గదా! మరి మనం భగవంతుడు ఎలా వుంచితే అలాగే వుంటున్నాం గదా! అని మనకనిపించవచ్చు. ఈ విషయాన్ని గూర్చి స్వంత విశ్లేషణకంటే పూజ్యశ్రీ మాస్టరుగారి ఆచరణ చూస్తే మనకు చక్కగా అవగతమవుతుంది.

పూజ్యశ్రీ మాస్టరుగారు ఆధ్యాత్మిక జీవితానికి అంకితమవకముందే ఆయన అలాంటి స్థితిలో వున్నారని మనకు తెలుస్తుంది. తండ్రిగారి అనారోగ్యం వల్ల యింటి ఆర్థిక పరిస్థితి బాగాలేనప్పుడు ఆయన ఒకే ఒక నోట్-బుక్(note book) తో M.A. పూర్తి చేసారు. ఇస్త్రీ లేని, చేతితో ఉతికిన పాంటు చొక్కాలతో క్లాసుకు వెళ్ళారు. హాస్టల్ లోని గాడిపొయ్యిలోని మసితో పండ్లు తోముకున్నారు. స్నాన సమయంలో ఇసుకతోనూ, కేవలం ఒట్టి చేతులతోనూ ఒళ్ళు రుద్దుకున్నారు. వేడివలన నోరుపొక్కి ఏమీ తినలేక పోతున్నప్పటికీ తినగలిగేవాటి కోసం ఆయన ఆరాటపడలేదు. అలానే ఏమీ తినకుండా వుండిపోయేవారు. బ్రహ్మచారిగా వుండగా ఆయన ఎన్నో అపవాదులను ఎదుర్కొన్నారు. జీవితంలో యివి సహజమంటూ వాటిని చిరునవ్వుతో దాటవేసారు.

సం॥1963లో శ్రీ సాయినాథుని అనుగ్రహం



పొందాక ఆయన స్థితి అతీతమైనదే అయినప్పటికీ సామాన్య మానవుని వలె ఆయన అనేక క్లిష్ట పరిస్థితుల నెదుర్కొన్నారు. ప్రజలు బాబా భక్తునిగా ఆయనకు నీరాజనాలర్పించినప్పటికీ ఆయన పొంగిపోలేదు. మరొకవంక దొంగస్వామిగా ఆయన గురించి ప్రచారమైనప్పటికీ ఆయన కృంగిపోలేదు. ఎక్కడికైనా కాలినడకన వెళ్ళవలసివచ్చినా, కారులో వెళ్ళవలసివచ్చినా ఆయన ఒకే విధంగా స్పందించారు.

ఇంట్లోని పరిస్థితులు, కుటుంబ ఆర్థిక పరిస్థితి కష్టంగా వున్నప్పటికీ, తమవల్ల ఎంతో మేలు పొందినవారిని గాని, తమవలన ఆర్థిక సహాయం పొందినవారిని గాని, లేక తమను గురువుగా భావించి తాము కోరితే ఎంతైనా సహాయం చేయగలిగిన వారిని గాని ఆయన అర్థించలేదు. నిబ్బరాన్ని కోల్పోలేదు.

ఆయన మొదట ఒంగోలులో లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరారు. రెండవ అన్నగారి కోరికపై ఆ ఉద్యోగం మానేసి I.A.S. పరీక్షకు చదివారు. తర్వాత హైదరాబాద్ లోని వివేకవర్ధని కాలేజీలో పనిచేసారు. తర్వాత అది గూడ మానేసి బాపట్లలోని కాలేజిలో పనిచేసారు. తర్వాత ఆ ఉద్యోగము వదిలేసి జిల్లెళ్ళమూడి అమ్మ సన్నిధిలో కొంతకాలమున్నారు. అక్కడి నుంచి తిరిగి నెల్లూరు జిల్లా విద్యానగర్ కాలేజిలో చేరారు. ఆయన కాలేజీ మారి మరొక కాలేజీలో చేరిన ప్రతిసారీ సీనియర్ గా కాక జూనియర్ గా తక్కువ జీతంతో చేరవలసి వచ్చేది. కారణాలు ఏమైనప్పటికీ వివిధ కాలేజీలు మారవలసి వచ్చినా ఆయన కొంచెంకూడా బాధపడలేదు.

విద్యానగర్ లో ఆయన బాబా ప్రచారం చేపట్టి సాయిబాబా మందిరాన్ని నిర్మించారు. తర్వాత అక్కడ ఏర్పడిన క్లిష్ట పరిస్థితుల వల్ల ఆ ఉద్యోగము వదిలేయడమేగాక, ఆ ఊరు వదిలి ఒంగోలు రావలసివచ్చినా ఆయన చలించలేదు. బాబాపై కించపడలేదు. కనీసం ఎందుకిట్లా చేసారని బాబాను ప్రశ్నించలేదు. అంతా బాబా సంకల్పంగా ఆయన భావించారు. అపనిందలను సంతోషంగా స్వీకరించారు. సన్నిహితులు తప్ప ఆయనను చూసిన వారికెవరికీ ఆయన కష్టాలలో వున్నట్లే తెలిసేది కాదు. తన కష్టాలను ఎవరికీ తెలియనీయక తాము ఆనందంగా వుంటూ అందరికీ ఆనందాన్నందించారు.

ఒక ప్రక్క దేశవిదేశాలలో ఎందరో ఆయనను ఎంతగానో కీర్తిస్తున్నారు. మరొక ప్రక్క అసూయాద్వేషాలతో కొందరు విమర్శిస్తున్నారు. ఆయనకు నిందలు వచ్చినపుడు వాటిని తొలగించుకోవడానికి ప్రయత్నించలేదు. అపనిందలు వేసిన వారిని నిందించనూ లేదు, దండించనూ లేదు. ఎవరైనా తమను కీర్తించినపుడు ఆ కీర్తిని పెంచుకోవడానికి ప్రయత్నించలేదు. కీర్తించినవారిని ఆకాశానికెక్కించనూ లేదు. ఆయన యిలా అనేవారు: "వారు పొగిడేదీ, విమర్శించేదీ వారి భావాలనే!" అని.

ఒకసారి పూజ్యశ్రీమాస్టరుగారిని ఒకరిలా ప్రశ్నించారు: "మాస్టారూ! మీరు ఒంగోలులో స్థిరపడినట్లేనా?" అని. అప్పుడాయన చెప్పిన సమాధానమిది. "అదేమీ లేదయ్యా! బాబా ఎక్కడ వుంచితే అక్కడే!"

సుఖాలువచ్చినపుడుచేసే 'ఆహా' అనేశబ్దాలూ, కష్టాలు కలిగినపుడు చేసే హాహాకారాలూ – రెండూ భగవంతుడు మనలను ఎలా వుంచితే అలా వుండలేకపోవడానికి సంకేతాలే. ఎటువంటి పరిస్థితులలోనైనా పొంగక, కృంగక ఒకేరకంగా వుండగలగడమే భగవంతుడు ఎలా వుంచితే అలా వుండడమంటే!

“ఇవన్నీ మనకు తెలిసిన విషయాలే గదా! మళ్ళీ చెప్పుకోవలసిన అవసరమేమున్నది?' అనిపించవచ్చు. పూజ్యశ్రీ మాస్టరుగారి విషయాలు ఎన్నిసార్లు చెప్పుకున్నా తనివి తీరదు. అంతేగాక వాటిని స్మరించుకోవడం వల్ల మనలను మనం యింకా యింకా సరిదిద్దుకోవడానికి అవకాశముంటుంది.

అయితే మనమేం చేయాలి? ఆయన గొప్పతనం గూర్చి చెప్పుకుని ఆనందిస్తూ వుండడమేనా? అంతే అయితే ఆయన మన మధ్యకు ఎందుకు వచ్చినట్లు? ఎందరికో ఆర్థిక బాధలను తీర్చిన ఆయన తమ ఆర్థిక యిబ్బందులను తొలగించుకోలేరా? ఎందరి క్లిష్ట సమస్యలనో తమ అమూల్య సలహాలతో అవలీలగా నివారింపజేసిన ఆయనకు తమ సమస్యలొక లెక్కా? సర్వ సమర్థులైన సాయినాథుని సంపూర్ణంగా విశ్వసించిన ఆయనకు దేనికైనా కొరత రావలసిన అవసరమేమున్నది? అయితే ఆయన ఎందుకు అలా జీవించారు? దానికి ఒక్కటే సమాధానం – అలా వుండడాన్ని మనకు నేర్పడానికి మాత్రమే! ఆయన కాబట్టి అలా వుండగలిగారు. సామాన్యులమైన మనమలా ఎలా వుండగలము? అని కొట్టిపారేయడానికి మాత్రం కాదు. అలా వుండవచ్చు అని తెలియజెప్పడానికోసమే. అందుకని మనంగూడా 'ఉన్నదానితో అసంతృప్తి, లేని దేనికోసమో తపన' పడకుండా భగవంతుడు మనలను ఎలా వుంచితే అలా వుండడానికి ప్రయత్నించాలి. అలా చేసినప్పుడే మనం ఆయనను సంతోషపెట్టిన వారమవుతాము. అదే పూజ్యశ్రీ మాస్టరుగారికి మనమిచ్చే నిజమైన దక్షిణ! ●

## శుభ చింతనలకు చెలికాడు ఓరిమి!

05వ పేజీ తరువాయి

వంటి మహనీయులుద్భవిస్తూనే వుంటారు.

ఇటువంటి సద్గురువుల బోధనలు తారుమారు చేయడమనే దౌష్ట్యం నేడు సాయి సాంప్రదాయంలో గూడ చోటుచేసుకొంటూండడం శోచనీయం. ఈనాడెందరో సాయి భక్తులమని చెప్పుకుంటూనే సాయి ఏనాడు చెప్పని విషయాలు తమ చిత్తానికి తోచినవాటిని వేదవాక్కులుగా తమ అనుయాయులనెత్తిన రుద్దుతున్నారు.

కొన్ని ఉదాహరణలు:

నేడు సాయి భక్తులు కొందరిలో విచిత్రమైన అభిప్రాయాలు ప్రచారమవుతున్నాయి. శ్రీ సాయి రాతిమీద కూర్చున్న చిత్రం గృహస్థుల యిళ్ళలో పూజించరాదని, ఆ చిత్రంలోని సాయి లౌకిక చింతలుమాని పూర్ణవిరాగంతో ఆత్మస్థులై యుంటారని, కనుక లౌకిక శ్రేయస్సు నాశించే భక్తులకు అది లౌకిక సుఖాన్ని చెడగొట్టి ఆత్మోన్ముఖులను చేసేదిగా వుంటుందని వీరి కల్పన. అలాగాక సాయి ద్వారకామాయిలోని తమ ఆసనంమీద కూర్చొన్న చిత్రం సంసారులకు మేలట! కారణం అలా కూర్చున్న సాయి భక్తుల కష్టాల నాలకించి తీర్చేవారట!! అలానే బాబా భిక్షకు వెడుతున్న పటాన్ని పూజిస్తే భక్తులుగూడ భిక్షకులవుతారట!! మరొక ముఠావారు సాయియొక్క ఛాయాచిత్రంపూజకు తగదని, కారణం ఫకీరైన సాయిని ధ్యానిస్తే మనమూ ఫకీర్లమవుతామంటారు. శిరిడీలోని సమాధిమీది పటాన్ని ధ్యానిస్తే శిరిడీలోవలెనే మనకూ సిరిసంపదలూ కీర్తి లభిస్తాయట! వీటిలో ఏ ఒక్కమాటకైనా శిరిడీ సాయిబాబా జీవిత చరిత్రలోగాని, బోధనలోగాని ఎక్కడైనా ఆధారమున్నదా? తమను ఎదుటనున్నట్లే నిరంతరం ప్రేమతో గుర్తుంచుకొని తమ లీలలను గూర్తి చింతనచేస్తూ, తనను నమ్ముకుంటే తాను రక్షిస్తాననే సాయి చెప్పినది. కాని సాయి తెలియచెప్పక విడచిన 'అద్భుత సత్యాలను' తమ భక్తులకు బోధించచూస్తారీ సాయి భక్తులు !!●

# మాతృదేవి స్మృతులు

శ్రీ థామస్ రెడ్డి, కడప

పూజ్యశ్రీ అలివేలు మంగమ్మతల్లి లీలావైభవాన్ని కడపకు చెందిన శ్రీ థామస్ రెడ్డిగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు.

అది మార్చి 6, 1975. పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి వివాహమహోత్సవం. నేను ఆయన విద్యార్థుడను. ఆరోజే మొట్టమొదటిసారి పూజ్యశ్రీ అమ్మగారిని బనగానపల్లెలోని ఆంజనేయస్వామి గుడిలో వారి కళ్యాణంలో దర్శనం చేసుకున్నాను. ఆ సద్గురుదంపతులిద్దరికీ పాదనమస్కారం చేసుకునే భాగ్యం కూడా కలిగింది.

పూజ్యశ్రీ మాస్టరుగారి కుటుంబం ఒంగోలు వచ్చేశాక మా కుటుంబమంతా తరచూ వారి ఇంటికి వెళ్ళేవారము. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు చూపించే ఆప్యాయత మరువలేనిది. వారి హస్తములతో స్వయంగా కలిపిన ఊరగాయ అన్నం ముద్దలు తినే భాగ్యం పొందాము.

పూజ్యశ్రీ మాస్టరుగారి రచనల మీద నేను ఎం.ఫిల్ చేసిన గ్రంథం 'మహాత్ముల ముద్దుబిడ్డడు'.

"ఈ గ్రంథం ప్రసంగాలు, వ్యాసాల రూపంలోనే వుంది. దీనిలో భక్తుల అనుభవాలు కూడా జోడిస్తే జీవిత చరిత్ర అవుతుంది కదా!" అని పూజ్యశ్రీ అమ్మగారు చక్కటి సూచనలు, సలహాలు చెప్తూ ప్రోత్సహించారు. అప్పుడు నేను చాలామంది భక్తులను కలిసి వారినుంచి అనుభవాలు సేకరించి, వాటిని కూడా క్రోడీకరించి, గ్రంథరూపంలో తయారుచేసి పూజ్యశ్రీ అమ్మగారికి చూపించాను. చాలా ఓపికగా అంతా పరిశీలించి సరిదిద్దారు. 'నావాణి' పత్రికనుంచి పూజ్యశ్రీ మాస్టరుగారి తండ్రిగారికి సంబంధించిన కొన్ని వ్యాసాలు తీసిచ్చారు. అవన్నీ కూడా జత చేసుకున్నాను. పూజ్యశ్రీ మాస్టరుగారు నాకు స్వప్నంలో సూచించిన పేరునే గ్రంథానికి పెట్టమని పూజ్యశ్రీ అమ్మగారు ఆదేశించారు.

'ఆచార్య అమృతలేఖావళి' గ్రంథం కూడా మంగమూరుడొంకలోని పూజ్యశ్రీ మాస్టరుగారి స్వగృహంలో, పూజ్యశ్రీ అమ్మగారిచే ఆవిష్కరింపబడింది. మా దంపతులకు పూజ్యశ్రీ అమ్మగారు నూతన వస్త్రాలు బహూకరించారు. మా శ్రీమతి పూజ్యశ్రీ అమ్మగారు పెట్టిన చీరలాంటిది ఇంతవరకు తన దగ్గర లేదని, చాలా మంచి విలువైన చీర పెట్టారని ఆనందపడింది. తరువాత కూడా కుటుంబమంతా కలిసి వారి దగ్గరకు వెళుతుండేవారము. పూజ్యశ్రీ అమ్మగారు మమ్మల్ని చాలా వాత్సల్యంతో చూసుకునేవారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు గాని, పూజ్యశ్రీ అమ్మగారు గానీ ఎదుటివారు ఎన్ని తప్పులు చేసినా వాటిని ఎత్తి చూపి బాధపెట్టకుండా, ఆ వ్యక్తులకు వీరేమి మేలు చేయగలరో అంత తమ శాయశక్తులా చేయడానికి ప్రయత్నం చేస్తారు. ఎంతటి క్షమ! అది అత్యంత అరుదైన విషయం. పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి చెందాక వారిని ఆరాధించే వారినందరినీ పూజ్యశ్రీ అమ్మగారు మాతృవాత్సల్యంతో చూసుకున్నారు.

ఉద్యోగవిధులు, కుటుంబపరిస్థితుల దృష్ట్యా నేను ఎక్కువగా వారిని దర్శించుకునే వీలుండేది కాదు. చాలాకాలం తరువాత ఒకసారి దర్శనానికి వెళ్ళినప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు చేసిన లీల మీతో పంచుకుంటాను.

అది 2011 ఫిబ్రవరి 5వ తేదీ! ఆరోజు హైదరాబాదులోని నాగోలు పరిసర ప్రాంతంలో మా కళాశాలల ప్రధాన అధ్యక్షుల సమావేశం జరిగింది.

నేను హిందూపురం కళాశాలకు ప్రధాన అధ్యక్షుడిగా పనిచేస్తుండటం వల్ల ఆ సమావేశానికి హాజరయ్యాను. సాయంత్రం ఐదు గంటలకు సమావేశం అయిపోయాక పూజ్యశ్రీ అమ్మగారి దర్శనం చేసుకోవాలన్న కోరికతో, తోటి ఉద్యోగస్తులతో, "మీరు ఎం.జి బస్టాండుకు వెళ్లిపోండి. నేను మా అమ్మగారి దర్శనం చేసుకుని వస్తాను!" అని చెప్పి బస్టాండులో నిలబడి నా స్నేహితుడు ఆనంద వెంకటేశ్వర్లుకి ఫోన్ చేశాను. ఇక్కడికి రాకముందే వారితో మాట్లాడి పూజ్యశ్రీ అమ్మగారు ఎక్కడ వుంటారో తెలియజేయమంటే, "ఇప్పుడు చెప్పినా నువ్వు కనుక్కోవడం కష్టం. అక్కడికి వెళ్ళినప్పుడు నాకు ఫోను చెయ్యి, చెప్తాను!" అన్నారు. అందుకని బస్టాండు నుంచి అతనికి ఫోను చేశాను. ఎన్నిసార్లు ఫోను చేసినా ఫోను తీయలేదు. ఇక చివరికి, 'నాకు ప్రాప్తం లేదులే! నేను ఒక్కడినే వెళ్లలేను' అనుకొని నిరాశగా బస్సు ఎక్కబోతున్నాను.

అప్పుడే ఒక అద్భుతం జరిగింది. వెనకనుంచి ఎవరో బస్సు ఎక్కుతున్న నన్ను, "థామస్ రెడ్డి సార్, థామస్ రెడ్డి సార్!" అని పిలిచారు. నేను గబుక్కున బస్సు దిగి వెనక్కి తిరిగి చూశాను. ఒక అబ్బాయి నాతో, "నేను మిమ్మల్ని ఒంగోలులో చూశాను సార్! మీరు నాకు తెలుసు!" అన్నాడు. నేను అతనిని గుర్తుపట్టలేదు. అతను, "ఎక్కడికి వెడుతున్నారు?" అనడిగితే, "నాగోలులో మా గురుపత్ని అలివేలుమంగమ్మగారిని దర్శించుకోవాలి అనుకున్నాను. కానీ దారి తెలియక తిరిగి వెళ్లిపోతున్నాను!" అని చెప్పాను. అతను వెంటనే, "సార్! నేను ఇప్పుడే వారి దర్శనం చేసుకుని వస్తున్నాను. కావాలంటే మిమ్మల్ని మళ్ళీ ఇప్పుడు వారి దర్శనానికి తీసుకెళ్తాను" అన్నాడు! నాకు చాలా సంతోషం వేసి, "సరే రానుపోను ఆటో మాట్లాడు. నన్ను అక్కడ దింపేసి నువ్వు మళ్ళీ ఆటోలో యిక్కడికి వచ్చేయి!" అన్నాను. అతను ఒక ఆటో మాట్లాడి, పూజ్యశ్రీ అమ్మగారు వుండే చోట నన్ను దింపి మరలా అదే ఆటోలో వెనక్కి వెళ్ళిపోయాడు.

నేను వెళ్లేసరికి ఇంకా పూజ్యశ్రీ అమ్మగారు సత్సంగహాలులోకి రాలేదు. అక్కడ ఎవరో వివేకానందస్వామి జీవిత చరిత్ర పారాయణ చేస్తున్నారు. కొంతసేపటికి పూజ్యశ్రీ అమ్మగారు చక్రాల కుర్చీలో ఆ గదిలోకి వస్తూనే నన్ను చూసి చిన్నగా నవ్వారు. తరువాత నేను వెళ్లి పాదనమస్కారం చేసుకున్నాను. అప్పుడు, "పిల్లలు ఎలా వున్నారు?" అని మళ్ళీ చిన్నగా అడిగారు. "అందరూ బాగున్నారు!" అని చెప్పాను. కొద్దిసేపు తరువాత ఊదీ చేతిలో వేశారు. నేను నమస్కారం చేసుకొని బయటకు వచ్చాను. మళ్లీ నాకు, 'తిరిగి ఇక్కడినుంచి బస్టాండు వరకు ఎలా వెళ్ళాలి?' అన్న ప్రశ్న మొదలైంది. ఈలోపల ఒకతను నా దగ్గరకు వచ్చి, "సార్! మీరు థామస్ రెడ్డిగారు కదా! మీరు ఎటు వెళ్ళాలి? నా పేరు సత్యనారాయణ. నేను కూకట్ పల్లి నుంచి కారులో వచ్చాను. మీరు అటే వెళ్తుంటే నాతో రావచ్చు!" అన్నాడు! "నేను ఎం.జి బస్టాండుకి వెళ్ళాలి. అనంతపురం బస్సు ఎక్కాలి!" అని చెప్పాను. "నేను మిమ్మల్ని బస్సు ఎక్కించి వెళ్తాను!" అని తన కారులో తీసుకెళ్లారు! అలా పూజ్యశ్రీ అమ్మగారు నన్ను క్షేమంగా తీసుకువచ్చి, దర్శనం యిచ్చి, క్షేమంగా పంపించారు.

తరువాత ఈ విషయం తలుచుకుంటే చాలా ఆశ్చర్యానందాలు కలుగుతాయి. ఆ కొత్త వూరిలో ముక్కుమొహం తెలియని ఒక అబ్బాయి అకస్మాత్తుగా వచ్చి నన్ను పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి తీసుకెళ్లడమేమిటి?! పైగా 'నేనిప్పుడే దర్శనం చేసుకుని వచ్చాను' అన్నాడు. కానీ పూజ్యశ్రీ అమ్మగారు నేను వెళ్ళిన తరువాతనే సత్సంగహాలులోకి వచ్చారు కదా! అతనెలా దర్శించుకుని వుంటాడు? ఇంతకీ నేను అతని పేరు కానీ, ఎక్కడ వుంటావని కానీ ఏమీ అడగలేదు. మరి అతను ఎవరై వుంటాడు? అతను ఇంతవరకు మళ్ళీ నాకు ఫోను చేయనేలేదు! పూజ్యశ్రీ అమ్మగారు అపారమైన వాత్సల్యంతో నన్ను ఆవిధంగా అనుగ్రహించారని తలచుకున్నప్పుడల్లా మనసు పులకరిస్తుంది. ఘటనాఘటన సమర్థులైన వారికి అసాధ్యమేముంది?

ఇంతటి మహనీయుల కుటుంబంతో పరిచయమవడం నేను చేసుకున్న సుకృతంగా భావిస్తూ, పూజ్య గురుపత్ని దివ్యజనని శ్రీ అలివేలు మంగమ్మతల్లికి శతసహస్ర నమస్సుమాంజలి సమర్పిస్తున్నాను.

ఓం వాత్సల్యాయై శ్రీ అలివేలు మంగాయై నమః!

జై సాయి మాస్టర్!

# మాతృదేవి చతుర్థ ఆరాధనా మహోత్సవము

**శ్రీమతి టి. పద్మావతి**

జూన్ మూడవ తేదీ పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి భౌతిక దేహాన్ని వదిలి విశ్వవ్యాప్తమైన రోజు!

***"యా దేవీ సర్వభూతేషు శక్తి రూపేణ సంస్థితా"***

ఈ సృష్టిలో వున్న అన్ని భూతాల్లోనూ శక్తిరూపంగా తానే నెలకొనివున్న స్వరూపం మన మాతృదేవి! వారు సం॥2021 జూన్ మూడవ తేదీన సమాధిస్థితులై, ఆ సమాధి నుంచి కూడా ఎందరికో సమాధానం చెబుతూ నిత్యసత్యులై విరాజిల్లుతున్నారు.

అంతటి జగజ్జనని వార్షికోత్సవ వేడుకలు గుమ్మళంపాడు భట్లమాచవరం మధ్యన వున్న 'శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానము' నందు, జూన్ రెండవ తేదీ నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. అనేక ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ముందు రోజంతా ప్రాంగణాన్ని భక్తిశ్రద్ధలతో అలంకరించుకుంటూ, మరునాటి వుత్సవానికి సర్వం సిద్ధం చేస్తూ, సేవకి వచ్చిన వారందరూ, అమ్మతో తమకి గల అనుబంధాన్ని పదేపదే చెప్పుకుంటూ ఆనంద డోలికలలో తేలియాడారు.

జూన్ మూడవ తేదీ వుదయం మేలుకొలుపుతో వార్షికోత్సవం ప్రారంభమైంది. అనంతరం కాకడ హారతి జరిగింది. తదనంతరం సుమారు 7 గంటల ప్రాంతంలో మాతృదేవికి పసుపు, కుంకుమ, గంధము, యితర సుగంధ ద్రవ్యములు, తులసి మారేడు దళములు, సముద్ర జలాలు మొదలైన వాటితో ప్రత్యేక అభిషేకము, తరువాత ప్రత్యేక అలంకరణ జరిగింది.

దాదాపు పది గంటల సమయంలో గురు పుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ దంపతులు భక్తులందరి తరఫున మాతృదేవి శ్రీ అలివేలు మంగమ్మ తల్లి కి మహావైభవంగా ప్రత్యేక పూజ చేయడం జరిగింది. తదుపరి గురుపుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు సత్సంగం ప్రారంభించారు. అందులో కొన్ని విశేషాలు మనం యిప్పుడు స్మరించుకుందాం.

"ఈ సృష్టి మొత్తం ఒకే శక్తి. అదే యిన్ని రూపాలు ధరించి, వున్నన్నాళ్ళు ఆ రూపంలో వుండి తర్వాత వెళ్ళిపోతూ వుంటుంది. ఇలా అన్ని రూపాల్లో వుండి తాండవం చేస్తున్న దాని పేరు నటరాజు. దీన్ని 'శివతాండవం' అంటారు. ఈ నటరాజు ఎవరంటే త్రిమూర్తుల రూపంలో యీ సృష్టి అంతటినీ కలిసికట్టుగా వుండి నడిపిస్తున్న గురుస్వరూపం. ఆ గురువే తల్లి, తండ్రి, సర్వస్వము!

పూజ్యశ్రీ అమ్మగారికి మనమందరం బిడ్డలమే. మనందరం వారి నుంచే వుద్భవించాం. ఆ శక్తే మనందరినీ తల్లి, తండ్రియై నడిపిస్తుంది.

మనం ఏ పని చేస్తున్నా, మన మనస్సు, శరీరం సరిగ్గా పని చేస్తున్నా, కొత్త విషయాలు తెలుసుకుంటున్నా, మనలో ఆ తెలుసుకునే శక్తి గురువు, అదే 'త్వమేవ విద్య!' అంటే.

ఇక త్వమేవ ద్రవిణం అంటే, ప్రవాహం. సృష్టి యావత్తు ఒక ప్రవాహంలో కొనసాగుతోంది. పంట పండించటం, యింటికి తీసుకుని వచ్చి వండటం, ఆ వండిన ఆహారం శక్తిగామారటం – యిదంతా ద్రవిణం. యిదే కాదు మనం కోరుకునే డబ్బులు, పేరు, సుఖాలు ఏది సంపాదించుకున్నా వాటిలో వున్నది ద్రవిణం రూపంలో వారే,,,,

అంతే కాదు, త్వమేవ సర్వం మమ దేవదేవ, అంటే ఆ గురువే యీ సర్వము అయి వున్నారు. తల్లిదండ్రుల రూపంలో, ద్రవిణం రూపంలో, మొత్తం అంతటా నిండి వున్నది ఆ గురు స్వరూపమే!

మనం గుర్తించినా, లేకున్నా – జాగ్రత్తగా శ్వాస ఆడేటట్టు ఒకడు చూస్తూ వుంటాడు. మనం మాట్లాడేటప్పుడు, తినేటప్పుడు నాలుక పంటికింద పడకుండా యింకొకడు కాపాడుతూ వుంటాడు. కనుక యీ సృష్టి అంతా ఒక సమన్వయంతో పని చేస్తూ వుంటుంది. 'నేను బ్రతుకుతున్నాను' అనిపిస్తూ, మనంగా బ్రతుకుతున్న ప్రకృతి శక్తి పేరు గురువు. ఈ గుర్తింపు ఎంత లోతుగా వుంటే మనిషి అంతగా ఎదిగినట్టు. ఈ గుర్తింపు ఎంత తక్కువగా వుంటే అంత పసిపిల్లవాడి కింద లెక్క. మన శరీరం ఎంత ఎదిగినప్పటికీ మానసిక పరిస్థితి మాత్రం చిన్న పిల్లవాడి చేష్టలను పోలివుంటుంది. యిది గమనిస్తే చాలా తమాషాగా వుంటుంది.

చిన్న పిల్లవాడు పుట్టిన తర్వాత కొన్ని రోజులకి తన చేతిని నోట్లో పెట్టుకోవడానికి విశ్వ ప్రయత్నం చేస్తాడు. నెమ్మదిగా కష్టపడి ముందు వ్రేళ్ళను పెట్టుకుని, తర్వాత చేతిని నోట్లో పెట్టుకోగలుగుతాడు. మనం ఎదిగి ఒక ఆఫీసులో వుద్యోగం వచ్చిన తర్వాత చుట్టుపక్కల వాళ్ళందర్నీ అజమాయిషీ చేస్తూ అదుపులో పెట్టడం, యిందాక పిల్లాడి స్థితి. అంటే వాడికి యింకా ఎదుగుదల రాలేదు అని అర్థం. ఆ పిల్లవాడు కొంచెం ఎదిగిన తర్వాత ప్రతి వస్తువు 'నాది' అంటాడు. వస్తు సేకరణ చేస్తాడు. అన్నీ 'నాకే కావాలి' అంటాడు. అది వాడిది కాకపోయినా, అది వాళ్ళ నాన్న కొనిచ్చినా సరే 'నాది' అంటాడు. అలాగే మనం కూడా! నాకు అన్నీ తెలుసు, నేను చాలా తెలివిగలవాడిని అనే వాళ్ళందరూ కూడా ఆ పిల్లవాడికి వున్న తెలివి దగ్గరే ఆగిపోయారని అర్థం.

అలాగే కొన్నాళ్ళకి ఆ పిల్లవాడికి ఆ వస్తువులతో విసుగు పుట్టి బయటికి వెళ్దాం, అంటే పార్కుకి వెళ్దాం, యింకా ఏదైనా ప్రదేశాలకు వెళ్దాం అని బయట వాటి మీద ఆశపడుతూ వుంటాడు. అలాగే మనం కూడా చుట్టూ వున్న పరిస్థితులు కాకుండా యింకా ఏదైనా కొత్తది కావాలి. దాన్లో ఏముందో చూద్దాం అని ప్రయాణం ప్రారంభిస్తారు, వాళ్లే పొలిటిషియన్స్ మొదలైన వాళ్లు.

ఈ పిల్లవాడు యింకొంచెం పెద్దయ్యాక పక్కన వాడికున్న యిన్ఫర్మేషన్ కంటే నా దగ్గర ఎక్కువ యిన్ఫర్మేషన్ వుండాలని నేను ప్రత్యేకంగా వుండాలని కోరుకుంటూ వుంటాడు. అలాగే యీ పోటీ ప్రపంచంలో కొత్త కొత్త మెళకువలు నేర్చుకోవాలని కొత్త రకాల నైపుణ్యాలను సంపాదించాలని పోటీ పడుతుంటారు. ఇవన్నీ ఆ పిల్లవాడి చేష్టాల్లాంటివే.

అయితే ఆట యిక్కడ లేదు. మరి ఎక్కడుందంటే, జీవితంపాటికి జీవితం నడుస్తూ వుంటే దానికి ఎదురెళ్లక దానితో సమన్వయంగా మనం వెళుతూ వుండడంలో వుంది. దానివల్ల ఏమీ పట్టని పరిస్థితి వస్తుంది. అయినా యింకా అప్పటికి ఆధ్యాత్మికత ఏమీరాదు. ఊరికే ప్రకృతి నడిపిస్తుంది అని తెలుసుకుని దానితో నడవడం మాత్రమే వస్తుంది. అలాంటి వాడికి, 'జీవితాన్ని సుగమం చేసుకోవడం సమన్వయం ద్వారా వస్తుంది' అనే మెలకువ వస్తుంది. ఆ ప్రయత్నం చేయడంలో, తన చేతుల్లో ఎంత వుందో తెలియడం ద్వారా, యీ సృష్టి మొత్తాన్ని నడిపే తత్వానికి శరణాగతి చెందుతాడు. దాన్నే భక్తి, సాధన, అంటారు. అక్కడిదాకా వచ్చిన వాడు పూర్తిగా ఎదిగినవాడు. అట్టివాడికీ యీ మొత్తానికీ తేడా వుండదు. వాళ్లే మహాత్ములు!! అక్కడదాకా వచ్చిన మహాత్ములకు మనందరి చేష్టలు, యిందాక మనం చెప్పుకున్న ఆ చిన్న పిల్లల చేష్టల లాగ వుంటాయి.

ఇలా భూమి మీదకి మహాత్ములుగా వచ్చిన వారి వ్యవహారంలో, కొన్ని రకాలు మనం చూడొచ్చు. అంటే ఒక మహాత్ముడు ఒకడితో, 'ఏది ఏమైనా మనసు చాలా ముఖ్యం, ఆ మనస్సుని నియంత్రించడానికి ధ్యానం చెయ్యాలి,' అని కొన్ని పద్ధతులు చెప్తాడు. దాన్ని అనుసరించే వారందరూ ఆ మహాత్ముణ్ణి అనుసరిస్తారు. ఇంకొక మహాత్ముడు, 'అలా కూర్చుంటే మనసు లొంగ తీసుకోలేవు, గాని భజన చెయ్యి, దాని ద్వారా నీ మనసు వచ్చి ప్రశాంతంగా కూర్చుంటుంది' అంటాడు. ఇంకొంతమందికి 'నువ్వు ధ్యానం, భజన, చేస్తే కుదరదు గాని, సేవ చెయ్. గో సేవ, కుంటి, గుడ్డి వాళ్ళకి, అనాథలకు సేవ చేస్తే మనసు కుదుటపడుతుంది' అని చెప్తారు కొందరు మహాత్ములు. అయితే వీరందరూ మన స్వభావాలను బట్టి, మనకి దేనిమీద ఆసక్తి వుందో, దాన్నిబట్టి అటువైపుగా మన మనసుని తిప్పి, గమ్యం చేర్చడమే వీరందరి లక్ష్యం.

వీటన్నిటికీ సమన్వయంగా ఆయా కాల పరిస్థితిని అనుసరించి దత్తాత్రేయుడే అంటే ఒకే శక్తి, శ్రీపాద శ్రీవల్లభులు, శ్రీ నృసింహ సరస్వతి, శ్రీ మాణిక్య ప్రభు,

శ్రీ అక్కలకోట స్వామిగా వచ్చారు. అయితే 18, 19 శతాబ్దాల కాలం నాటికి మానవుల మానసిక పరిస్థితిని అనుసరించి శ్రీ శిరిడి సాయినాథుడు, వారందరికీ సమన్వయమూర్తిగా అవతరించారు. ఇంతటి సమన్వయ మూర్తి మనకు చరిత్రలో ఎక్కడా కనిపించరు. అన్ని మతాల వారికి, అన్ని కులాల వారికి, ఎప్పుడంటే అప్పుడు ఎక్కడంటే అక్కడ, ఎలాగంటే అలాగ, లీలలు ప్రకటించారు. అయినా వాటిని మానవ జాతి తగినంత గ్రహించలేదు. అందువల్ల వీరే మరొక రూపంలో పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారిలా ప్రత్యేకంగా అవతరించి పై ఐదుగురి దత్తావతార బోధలను తమ రచనల ద్వారా సమన్వయ పరచారు. భక్తి జ్ఞాన వైరాగ్యాలకు భగవద్గీత తరవాత అంతటి సమన్వయాన్ని మనకందించారు.

అంతేకాదు, పూజ్యశ్రీ మాస్టరుగారి అవతారం పరిపూర్ణం అవ్వాలంటే దంపతులుగా రావాలి,, అప్పుడు మాత్రమే శిరిడీ సాయినాథుని బోధలను సమన్వయం చేయడానికి అవకాశం వుంటుంది. దాదాపు మానవ జాతికి వున్న కష్టాలన్నీ ప్రోగుచేసుకుని వచ్చారు వారిద్దరూ(పూజ్యశ్రీ మాస్టరుగారు పూజ్యశ్రీ అమ్మగారు). 'ధైర్యం, ఓర్పు, ఆనందం, కర్తవ్యం అన్నీ కలసినదే ఆధ్యాత్మికత' అని నిరూపించారు ఆ పుణ్యదంపతులు. వారిద్దరి బోధ మనందరికీ ఆచరణ లోకి వచ్చేయాలి, అది మనందరి బాధ్యత. పూజ్యశ్రీ అమ్మగారు శరీరం వదిలాక, ఆధ్యాత్మికంగా నిజాయితీగా బాధ్యత తీసుకుని ఎవరు ప్రయత్నం చేస్తారో వారే తల్లికి తగ్గ బిడ్డలు అనిపించుకుంటారు. అటువంటి శక్తిని ప్రసాదించమని ప్రార్థిస్తూ,, పూజ్యశ్రీ అమ్మగారు శరీర త్యాగం చేసిన సమయం ఆసన్నమవుతుంది కనుక, వారికి హారతిచ్చి, తిరిగి సాయంత్రం హారతి తరువాత మళ్ళీ కొంతసేపు సత్సంగం చేసుకుందాం" అనిచెప్పి ఆ పూట కార్యక్రమాన్ని ముగించారు.

తిరిగి సాయంత్రం దాదాపు 7 గంటల సమయంలో గురుపుత్రులు శ్రీ ద్వారకబాబుగారు మరల కొంతసేపు సత్సంగం చేశారు. అందులో మరి కొన్ని విషయాలు యిప్పుడు చెప్పుకుందాం.

"ఉదయం సత్సంగంలో 'మన ఆధ్యాత్మికతకి మనమే బాధ్యత తీసుకోవాలి' అని చెప్పుకున్నాం. ఈ రోజు సమాజంలో చాలామంది ఒక గంటైనా ధ్యానం చేయడం రాకుండా, పుట్టి పెరిగి చచ్చిపోయే వాళ్ళే వున్నారు. అటువంటి వాళ్ళు, మాకు కోపం, అసూయ, భయం, చిరాకు, బద్ధకం, యివన్నీ ఎక్కువగా వచ్చేస్తున్నాయి మమ్మల్ని ఏం చేయమంటారు చెప్పండి? అని అడుగుతారు. వీటన్నిటికీ సమాధానం, ఎందరో మహాత్ముల నుంచి పూజ్యశ్రీ మాస్టరుగారి దాకా అందరూ చెప్పేసినా, వాటిని వేటిని వాడుకోము. అదీ మన గొప్పతనం. మనకి జిడిపి(Gross Domestic Prodect) అని ఒకటి వుంటుంది. అంటే దేశం మొత్తంలో జనాభా ఎంత? మనకున్న డబ్బులు ఎంత? దాని ప్రకారం సగటుకి ఒక సంవత్సరానికి మనిషికి ఎంత రావాలి అని లెక్కలుంటాయి. దాని ప్రకారం చూస్తే, మనకి రావాల్సింది చాలా తక్కువ మొత్తం. మనం అనుభవిస్తున్నది, కోరుకుంటున్నది, చాలా ఎక్కువ మొత్తం. దీన్ని సరిచేయలేం కనుక దోచుకుని తినడమే జరుగుతుంది. మరి యిప్పుడు మనం పారాయణ చేసి బాబాని ఏం అడుగుతున్నాం అంటే, దేశ పరిస్థితి ఎలా వున్నా నాకు మాత్రం ప్యాకేజీ బాగా రావాలి అని. అది ఫలించడానికి పారాయణ చేస్తాం. మనకి శ్రీసాయిలీలామృతము గ్రంథంలో వుంటుంది, 'యిదివరకు దానధర్మాలు చేస్తేనే యిప్పుడు సిరిసంపదలు వస్తాయి' అని, దాని ప్రకారం మన పిల్లలకు 'దానధర్మాలు చేయండి' అని నేర్పిస్తామా? నేర్పించం. నేర్పించలేదు కనుక మన పరిస్థితి యింతే అని ఊరుకుంటామా, ఊరుకోం! అక్కడ డబుల్ గేమ్ ఆడటం జరుగుతుంది. నువ్వు బాబా చెప్పినట్లు దానధర్మాలు చేయవు, యిప్పటి ప్రపంచ పరిస్థితి పట్టించుకోవు, నీకు మాత్రం మంచి ప్యాకేజీ రావాలని పారాయణ చేస్తావు. యీ మొత్తంలో ధర్మం, ఆధ్యాత్మిక, ఎటు నుంచి తీసుకురావాలి? ధ్యానం, దానం, ధర్మం, జీవితం, భగవంతుడు యివన్నీ ఏమిటి? వీటన్నిటికీ ముందు, మన మనసుని బాగుచేసుకోవాలి. అది ఎలా చేసుకోవాలో ధ్యానయోగ సర్వస్వంలో పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పారు. ఇది జరిగితేనే, ఓర్పు, క్షమ, ఆనందం కలుగుతాయి. మరి యిది సాధించకుండా ప్రశాంతంగా ఎలా జీవిస్తాం? కనుక మనసును ప్రశాంతంగా వుంచుకునే విద్య 'తప్పనిసరి' అన్నమాట. దీనిమీద పట్టువచ్చాక జీవితం అద్భుతంగా వుంటుంది. మరి యీ విద్య ఎలా నేర్చుకోవాలి అంటే, ప్రతిరోజు మహాత్ముల జీవిత చరిత్రలు చదివి, వారి జీవితాలలోనుంచి

సులువులు గ్రహించి, ఆ విధంగా ప్రయత్నిస్తే తప్పకుండా సఫలమవుతాం. మహాత్ముల జీవిత విధానం చూస్తే, వారికి ఏది ఎంతవరకు అవసరం? దాని కోసం ఎంతవరకు కష్టపడతారు? మిగతా సమయాన్ని ఎంత చక్కగా సద్వినియోగం చేసుకుంటారు? అన్నది తెలుస్తుంది. ఉదాహరణకి, పూజ్యశ్రీ అమ్మగారు తను ఎవరి మీద ఆధారపడకుండా బ్రతకాలి అంటే ఆవిడ ఎంచుకున్న వృత్తి లేక వుద్యోగ అవకాశాలు చూస్తే చాలా ఆశ్చర్యంగా వుంటాయి. ఒకటేమో హిందీ పండిట్ కోర్సు చేసి, పాఠాలు చెప్పుకోవడం, రెండోదేమో వాళ్ళ అన్నయ్యగారు వాళ్ళ దగ్గర ఏదో చిన్న గది తీసుకుని, లేదా మెట్ల కింద ఖాళీ వుంటే అక్కడ సాయంత్రం సమయంలో శనగపిండితో బజ్జీలు, చెగోడీలు వేసి, ఆ రోజుకి సంపాదించుకుని, వుదయం అంతా భగవంతుని స్మరణలో గడపడం. ఈ రెండు కూడా లేకపోతే ప్రపంచంలో బోలెడు ఆశ్రమాలు వున్నాయి. ఏదో వొక ఆశ్రమం దగ్గర చిమ్మి, కడిగి, సేవ చేసుకుంటే ఏదో ప్రసాదమో కొబ్బరిచిప్పో యిస్తారు కదా, అది చాలు హాయిగా, అన్నారు. అసలు మనకి ఊహలోనైనా యిలాంటి వాటిమీద ఆధారపడే ధైర్యం వుంటుందా? ఆవిడ ఎన్నుకున్న మార్గంలో, ఏసి కాదు కదా, కనీసం ఫ్యాన్ కూడా వుండదు. మరి హాయిగా ఎలా వుండగలుగుతారు? మనకి ఊహకి కూడా అందదు.

అలాగే గృహస్థాశ్రమం స్వీకరించాక, పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగారికి సాధన చెప్పారట. ఏంటంటే, సరిగ్గా సరిపోయేలాగ వంట చేయాలి. అంటే నేను ఎంత తింటానో నువ్వు ఎంత తింటావో తెలిసి దానికి సరిపడా వంట చేయాలి. 'ఒక ముద్ద ఎక్కువ తింటే ప్రకృతి నుంచి దోచుకున్నట్టు, అందుకు ఒక పారాయణ చేయాలి, అలానే ఒక ముద్ద తక్కువ తింటే లోపల వున్న దేవతలకి తక్కువ చేసినట్టు', అని చెప్పి 'నెల రోజులు సమయం యిస్తాను. ఆ విధానంలో వంట చేయాలి' అని చెప్పారట. సరిగ్గా పూజ్యశ్రీ అమ్మగారికి నెల రోజుల్లోనే అలా వంట చెయ్యడం వచ్చేసిందట. తర్వాత నుంచి ఎంత బియ్యం వండితే అంతమంది మనుషులు వచ్చి అన్నం సరిపోయేదిట. కొంచెమే సరిపోతుంది అన్నప్పుడు అన్ని బియ్యమే పెట్టాలి అని మనసుకి అనిపించేదట. అలా అమ్మగారికి ఆ విద్య అలవోకగా వచ్చేసింది. వీటిని 'నైపుణ్యాలు' అంటారు. ఒకసారి నాన్నగారు నాతో చెప్పారు – "కావలసిన దానికంటే ఎక్కువ సంపాదించు. నీకు కావాల్సిన దానికంటే తక్కువ వాడుకుని, మిగిలింది అవసరమైన వాళ్ళకి యివ్వాలి. అందుకని ఎక్కువ సంపాదించాలి" అన్నారు. నాకు కొబ్బరిపీచుతో తాడు పేనడం నేర్పారు. దాన్ని సాయంత్రానికి కొట్లో యిస్తే ఆ రోజుకి సరిపడా డబ్బులు వస్తాయి. దాంతో ఆ రోజు కడుపు నింపుకోవచ్చు. ఇలా చాలా రకాల స్కిల్స్ ఎప్పుడూ వుంటూనే వుంటాయి. ఇటువంటి జీవిత విధానం ఎప్పుడు సాధ్యపడుతుందంటే, లక్ష్యం మీద అవగాహన వుండి, మనసుకి తర్ఫీదునిచ్చుకోవడం వల్ల సాధ్యపడుతుంది. అందుకోసం ప్రతినిత్యం ధ్యానం చేయాలి. ధ్యానం చేస్తే మనసు నీ మాట వింటుంది. శరీరం మనసు మాట వింటుంది. కనుక యిప్పుడు ఏం చేద్దాం అంటే? 'బాబుగారు మీదే బాధ్యత' అనకండి. నేను కూడా అన్నీ కష్టపడి ఆచరించినవే. వారానికి 5గంటలు నిద్రపోయే వాడిని. వారానికి 1200 పేజీలు చదివేవాడిని. రోజుకి 6 లేక 7గంటలు ధ్యానం చేసేవాడిని. యానిమేషన్ కాలేజీకి వెళ్ళేవాడిని, నా బట్టలు నేను వుతుక్కునే వాడిని. కనుక ఎవరి బాధ్యత వాళ్ళు స్వీకరించి మనసుకు తర్ఫీదు నిచ్చుకుని, జీవితంలో ఎంత ముందుకు వెళితే అంత ప్రశాంతంగా వుంటుంది. అప్పుడు మాత్రమే వారికి తగిన బిడ్డలం అనిపించుకుంటాం.

పూజ్యశ్రీ అమ్మగారు విశ్వవ్యాప్తమైన శుభసందర్భంగా, అందరం ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, ఎంతటి కష్టమైనా చిరునవ్వుతో దాటేయగల ధైర్యంతో, నిరంతర సద్గురు స్మరణతో, వారికి నచ్చిన మార్గంలో నడిచేట్టుగా స్ఫూర్తినివ్వాలని, అటువంటి బాధ్యత ఎవరు తీసుకొని ప్రయత్నం చేస్తారో వాళ్ళు మాత్రమే సఫలం అవ్వాలని నా కోరికగా అమ్మగారికి ప్రార్థన" అంటూ సత్సంగాన్ని ముగించారు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు.

అనంతరము శ్రీ సాయి మాస్టర్ భక్త బృందం, ఒడియా వారిచే ఒడియాలోకి అనువదింపబడిన పూజ్య భరద్వాజ గురుదేవుల విరచితమైన 'శ్రీ స్వామి సమర్థ' గ్రంథం ఆవిష్కరింపబడింది. అంతటితో ఆరోజు కార్యక్రమాలకి ముగింపు పలికారు. ●

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

**శ్రీమతి అడిదం వేదవతి**

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

## 15వ ప్రసంగము

### నిస్పృహత్వానికి దృష్టాంతము

కాశీలో స్వామి భాస్కరానంద అనే మహాపురుషుడు వుండేవారు. వారు కేవలం కౌపీనము మాత్రమే ధరించేవారు. ఇల్లు అనేది వారికి లేదు. ఏ చెట్టు క్రిందనో పడివుండేవారు. ఒకప్పుడు ఒక గృహస్థు తమకు కుమారుడు కలిగినట్లయితే స్వామివారికి విలువైన శాలువా యిస్తానని మొక్కుకున్నాడు. దైవకృపవలన అతనికి సంతానం కలిగింది. అప్పుడతడు అయిదు వేల రూపాయల విలువగల శాలువా తెచ్చి వారికి కప్పి పడుకోబెట్టాడు. ఆ సమయంలో ఒక రాజుగారు అక్కడికి వచ్చి 'త్యాగి యొక్క లక్షణమేమిటి?' అని అడిగారు. స్వామివారు, 'మిమ్మల్నీ, గాడిదను సమానంగా చూడడం!' అని సమాధానం చెప్పారు. రాజుగారికి ఆ మాటలు ఎంతో కఠినంగా అనిపించి వెనుకకు వెళ్లారు. కూడా వున్న దివాను యిలా అడిగాడు – "మీరెందుకు వచ్చారు? ఎందుకు వెళ్ళిపోతున్నారు?"

రాజు: "స్వామివారు నాతో కఠినంగా మాట్లాడారు గనుక నేను వెళ్ళిపోతున్నాను".

దివాను: స్వామివారు నిజమే చెప్పారు. దాని అర్థం మీరు తెలుసుకోలేకపోయారు. పశు, పక్షి, మనుషులు మొ॥న ప్రాణులు అన్నింటిలోనూ వారికి సర్వాత్మ భావమే వుంటుంది. నిస్పృహి కానిదే అంత నిర్భయంగా సమాధానం చెప్పలేరు.

అది విని రాజుగారు మరలా స్వామివారి దగ్గరకు వచ్చి నమస్కరించారు. స్వామికి సాష్టాంగ నమస్కారం చేసి, క్షమాపణ కోరి వారి ఉపదేశాన్ని (బోధన) అర్థం చేసుకున్నారు. ఈ స్వామివారి లాగా పూర్ణ నిస్పృహి మాత్రమే అంత నిర్భయంగా మాట్లాడగలడు.

శాస్త్రంలో యిలా వుంది–

**శ్లో॥ఉదారస్య తృణం విత్తం శూరస్య మరణం తృణమ్ ।**
**విరక్తస్య తృణం భార్యా నిస్పృహస్య తృణం జగత్ ॥**

భావం: ఉదారునికి ధనం తృణం (గడ్డిపోచ)లాగా తోస్తుంది. వీరుడికి మరణం తృణప్రాయము. విరక్తి చెందిన

వాడికి భార్య తృణప్రాయము. నిస్పృహికి ప్రపంచమంతా తృణపాయమే!

సంతృప్తితో నైతికంగా సంపాదించిన సంపదను పరోపకారం కోసం వినియోగించడం గృహస్థుని ధర్మము.

ఇది విని జయంతీభాయి యిలా ప్రశ్నించాడు –

"అయితే నన్ను నా వృత్తిని మానేయమంటారా?"

స్వా॥ప్ర॥ ధర్మశాస్త్రాలిలా చెబుతున్నాయి –

**శ్లో॥ ద్వావిమౌ పురుషౌ లోకే శిరశ్శూల సమౌ మతౌ ।**
**గృహస్థశ్చ నిరారంభో యతిశ్చ సప్రతిగ్రహః ॥**

భావం: ఈ లోకంలో ఏ పనీ చేయని గృహస్థు, ప్రతిగ్రహము (దానము తీసుకోవడం) చేసే యతి తలనొప్పి లాంటివారు. కాబట్టి మీరు మీ మీ పనులు మాని ఇంట్లో ఎటువంటి పనీ చేయకుండా కూర్చుని వుంటే ఆడవారికి, పిల్లలకూ బాధను కలిగిస్తారు. అలానే నేను సన్యాసము తీసుకుని ఇంటింటికీ అడుక్కోడానికి వెళితే నా వల్ల గృహస్థులకు బాధలు కలుగుతాయి. మీ వైద్యవృత్తిని మీరు శ్రద్ధగా నిర్వర్తిస్తే మీ స్వార్థంతో పాటు పరమార్థాన్ని కూడా సాధించవచ్చు. పేదలకు ధనం తీసుకోకుండా సేవ చేయవచ్చు. ఇది ఎంతో మహత్తరమైన పురుషార్థం. నీతిగా పనిచేస్తే దేవుడు మీ యందు కృప చూపుతాడు. కాబట్టి మీకు వచ్చిన దానితో సంతోషించండి.

స్వా॥ని॥: సంతోషం లేనిదే మానవుడికి సుఖం కలుగదు. సంతోషం లేకపోతే బుద్ధి నశిస్తుంది. కాబట్టి సంతోషం కలిగివుండాలి. నాకు తోచింది నేను చెప్పాను. వారేమనుకున్నారో నాకేమి తెలుసు? వారి వయస్సు తక్కువ. ఇప్పుడు బాగా ధనాన్ని సంపాదించి వృద్ధాప్యంలో నిశ్చింతగా దేవుని స్మరించవచ్చని కూడా వారి ఉద్దేశం కావచ్చు.

## బాల్యం నుండే ఆత్మశ్రేయస్సు కోసం పాటుపడాలి

స్వా॥ప్ర॥: ముసలితనంలో దేవుని స్మరించవచ్చు, ఇప్పుడు ఆ అవసరం లేదని భావించడం తప్పు. చిన్నతనంలో చేయగలిగిన పనిని పెద్దతనంలో చేయలేము. తాజా పుష్పాలే దేవుని పూజకు తగినవి. వాడినవి తగవు. ఇందుకు ప్రహ్లాదుని ఆదర్శాన్ని గుర్తుంచుకోవాలి.

ప్రహ్లాదుడు అయిదారు సంవత్సరాల వయస్సులో వున్నప్పుడు శుక్రాచార్యుని కుమారులైన చండ, అమర్కుల దగ్గరకు చదువుకోడానికి వెళ్ళాడు. గురువుగారి ఇంట్లో ఇతర రాక్షస కుమారులతో కూడ చదువుకుంటున్నాడు. అతనికి దండనీతి మొ॥న విషయాలను గురువులు నేర్పారు. మొదట్లో గురువులు నేర్పిన ఈ విషయాలను శ్రద్ధాభక్తులతో నేర్చుకున్నాడు. కానీ ఈ విషయాలు అతనికి రుచించలేదు. ఎందుకంటే ఈ విషయాల వల్ల అతని మనస్సులో 'ఇది నాది', 'ఇది వేరేవారిది' అనే భావాలు కలిగేవి. ఈ తప్పుడు బంధాలలో చిక్కుకోవడం అతనికి ఇష్టం లేక, గురువులు నేర్పిన ఈ విషయాలలో శ్రద్ధ వుంచకుండా అతడు తన మనస్సును భగవంతునియందు లగ్నం చేశాడు. సాంసారిక సుఖాన్ని తెచ్చేటటువంటి ఈ విద్యలన్నీ అతనికి స్వప్నంతో సమానమైనవిగా తోచాయి. కాబట్టి అతడు చదువులో వెనుకబడ్డాడు.

ఒక రోజున తోటి విద్యార్థులు ఆ ప్రహ్లాదుని యిలా అడిగారు – "తమ్ముడా! ప్రహ్లాదుడా! ఈ మధ్య నువ్వు ఇంత విచారంగా కనిపిస్తున్నావెందుకు? మహారాజు కుమారునికి లభించనది ఏదైనా వుంటుందా? నీవు బుద్ధిమంతుడివి. నీకు రాని విద్యంటూ ఏమీ లేదు. మొదట్లో గురువులు నేర్పిన విద్యలన్నీ త్వరత్వరగా నేర్చుకునేవాడివి. ఇప్పుడిలా అయిపోడానికి కారణమేమిటి? నీకేమైనా బాధగా వుంటే మాకు చెప్పు. మాకు చేతనైనది చేస్తాము"

ప్రహ్లాదుడు యిలా సమాధానం చెప్పాడు – "సర్వకళ్యాణకరుడైన భగవంతుని మీద నా మనస్సు లగ్నమై వుండడం వల్ల ఆయనయందు తప్ప మరే వస్తువు మీద నా మనస్సు లగ్నమవడం లేదు. సోదరులారా! ఈ విద్యలన్నీ వ్యర్థం. వాటిలో అశాశ్వతమైన విషయాల గురించే చర్చ వుంటుంది. ఈ విద్యలు పొట్ట నింపుకోవడానికి మాత్రమే పనికివస్తాయి. పరిణామంలో జన్మ, మరణము అనే మహాదుఃఖాలు కలుగుతాయి. జన్మను పొందినందువలన

ధర్మాన్ని తెలుసుకుని ఈ మిధ్యా ప్రపంచం నుండి ముక్తిని పొంది భగవంతుని దర్శించడానికి ఉపయోగపడే విద్యే అసలైన విద్య. ఈ విచారణలోనే నేను ఎల్లప్పుడూ నిమగ్నమైవున్నాను. ఇక నాకు సాంసారిక పదార్థాల గురించి ఆలోచన ఎలా వుంటుంది? సోదరులారా! మానవజన్మ అత్యంత దుర్లభమైనది. దానిని వ్యర్థంగా గడిపేయడం వల్ల ప్రయోజనం లేదు.

**శ్లో॥ కౌమార ఆచరేత్ ప్రాజ్ఞో ధర్మాన్ భాగవతానిహ।**
**దుర్లభం మానుషం జన్మ తదప్య ధ్రువమర్థదమ్॥**

భావం: బుద్ధిమంతుడు బాల్యం నుండే ధర్మాన్ని పాటించాలి. ఎందుకంటే ఈ శరీరం అనిత్యము, అశాశ్వతమైనప్పటికీ దుర్లభమైనది. ఇదే పురుషార్థాన్నిస్తుంది.

"విషయసుఖంలో మునిగివుండి తప్పుడు మార్గంలో నీచుడు తన ఆయుష్షును వ్యర్థం చేయకూడదు. ఎందుకంటే ఒకసారి విషయసుఖంలో చిక్కుకుంటే దానినుండి బయటపడడం కష్టం."

సోదరులారా!

**శ్లో॥ కో గృహేషు పుమాన్ సక్తమాత్మానమజితేంద్రియః।**
**స్నేహపాశైః దృఢైర్బధ్ధముత్సహేత విమోచితుమ్॥**

భావం: ఇంద్రియాలను ఎవరు జయించలేడో అతడు గృహము మొ॥న వాటిల్లో బలవత్తరమైన స్నేహబంధముల చేత కట్టబడిన తన ఆత్మను వాటి నుండి ఎలా తప్పించగలడు?

"ప్రాణము కంటే ఎంతో ప్రీతికరమైన ధనాన్ని దొంగలు, నౌకర్లు, వ్యాపారస్థులు తమ ప్రాణాలను కూడా లెక్కచేయకుండా సంపాదిస్తారు. ఆ ధనదాహాన్ని ఎవడు విడువగలడు? కొడుకులు, కూతుళ్ళు, తల్లిదండ్రులు, అందమైన భవనాలు, మంచి జీవనోపాధి, పశువులు, నౌకర్లు మొ॥వి సంపాదించినా స్నేహబద్ధమైన లోభము వలన కలిగే తృష్ణకు (దాహానికి) అంతుండదు. ఇంద్రియానందము మాత్రమే గొప్పదిగా తలుస్తూ అంతులేని మోహంలో మానవుడు వాటిల్లో మునిగిపోతాడు. గూడు కట్టుకునే పురుగు తన ఇంటిని (గూటిని) నిర్మించుకుని లోపలే వుండిపోతుంది. బయటకు వచ్చే మార్గాన్ని కూడా వుంచుకోదు. అలానే మానవుడు స్త్రీ సాంగత్యంలో వుండే మనోహరమైన ఊహలను ఎలా విడువగలడు? వైరాగ్యమెలా కలుగుతుంది? ఇలా మైమరచినవాడు కుటుంబ వ్యవహారాలలో నీచానికి పాల్పడతాడు. ఆయుష్షు పూర్తయినా పురుషార్థాన్ని పొందడు. కుటుంబం పట్ల మోహము కలవారు సర్వకాల సర్వావస్థలందూ మూడు విధాలైన తాపాల వలన దుఃఖిస్తారు. అయినా దానిని దుఃఖముగా తలచరు. నిరంతరమూ ధర్మములో మనస్సును లగ్నం చేసేవాడు – ఇతరుల ధనమును దొంగిలించేవాడు ఈ లోకంలోను, పరలోకంలోను దుఃఖాన్ని పొందుతాడని, ధనసంపాదన వలన అనేక అనర్థాలు కలుగుతాయని తలుస్తాడు."

"ఓ రాక్షస కుమారులారా! మానవుడు తనకు, ఇతరులకు భేదమున్నదనే భావముతో కుటుంబపోషణ చేస్తున్నంత కాలము ఆత్మవిచారణ చేయడానికి సమర్థుడు కాలేడు. మూఢునిలాగా అహంకార మమకారాలకు లోనవుతాడు".

"బంధింపబడిన కోతిలాగా భార్యాపిల్లల బంధాల చేత బంధింపబడిన మానవుడు ఏ కాలంలోనూ, ఎట్టి పరిస్థితిలోనూ కూడా ఆత్మకు విముక్తి కలిగించడానికి సమర్థుడు కాడు. కాబట్టి విషయభోగాలను త్యజించి, రాక్షసులతో (దైత్యులతో) సాంగత్యమును వదిలి నారాయణుని భజించండి. నిస్సంగుడైన మానవుడు నారాయణుని భజించినట్లయితే మోక్షము కలుగుతుంది. శ్రీమన్నారాయణుడు సర్వాంతర్యామి, సర్వహితకరుడు, ప్రియమిత్రుడు. ఆయనను శరణు పొందడం మంచిది. భగవంతుని భజనను, సేవను వదిలి ఆయుష్షును

వ్యర్థంగా గడపడము, విషయసుఖంలో మునిగిపోవడం నిరుపయోగము. బంధువులారా! శరీరాన్ని ధరించడం వలన విషయసుఖము అన్ని ప్రాణులకూ కలుగుతుంది. కాబట్టి విషయసుఖానికి ఎక్కువగా ప్రయత్నం చేయవలసిన పనిలేదు. మానవజన్మమెత్తినందుకు శరీరంలో శక్తి వున్నంతవరకూ, సామర్థ్యం వున్నంత కాలమూ బుద్ధిమంతుడు ఆత్మశ్రేయస్సు కోసం ప్రయత్నించాలి. మీరూ హృదయాంతరంగుడైన భగవంతుని భజించండి".

"అహంకార మమకారాలకు స్థానమైన శరీరము తనది కాదు. సంతానము, భార్య, ఇల్లు, బంధువులు, శరీరానికి భిన్నములైన మమకార ప్రధానములైన పదార్థాలు ఇతరములైనవి (తనవి కానివి) అనడంలో సందేహమేమున్నది? ఆశ్చర్యమేమున్నది?"

"స్థావరజంగమాత్మకమైన (జడజీవ పదార్థాలతో కూడిన) పదార్థాలలో పరమాత్మ ఒక్కడే వున్నాడు. అతడికి నామరూపాలనే ఉపాధులు వుండవు. అయినా తన మాయాశక్తి వలన తానే వివిధ రూపాలను ధరిస్తాడు. పరమాత్మ యొక్క వాస్తవరూపము కేవలము సచ్చిదానందస్వరూపము. ఇటువంటి ప్రభువును పొందడానికి మీరు అసుర భావాన్ని వదిలి ప్రాణులందరిపైనా దయ కలిగివుండండి. ఎందుకంటే ప్రాణులన్నింటి పట్ల దయ కలిగివుండడం వల్ల సర్వాంతర్యామి అయిన పరమేశ్వరుడు ప్రసన్నుడవుతాడు."

**'శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్!'**

"మీరు కూడా నేను చెప్పినట్లే శ్రద్ధతో మెలిగినట్లైతే మీకు కూడా జ్ఞానం కలుగుతుంది. శ్రద్ధతో నాకు కలిగిన తత్త్వజ్ఞానమే స్త్రీలకు, పిల్లలకు కూడా కలుగుతుంది."

"జీవుడు జన్మిస్తాడు, బ్రతుకుతాడు, పెరుగుతాడు, వికాసము చెందుతాడు, క్షీణిస్తాడు, నశిస్తాడు. ఈ ఆరు వికారాలు కూడా చెట్టు యొక్క అస్తిత్వము చేత ఫలములోనే కలుగునట్లు, ఆత్మ యొక్క అస్తిత్వము చేత దేహంలో కలుగుతాయి. కానీ ఈ ఆరు వికారాలు ఆత్మకు కలుగవు. ఎందుకంటే ఆత్మ నిత్యమైనది. ఆత్మ ఒక్కటే! దేహాలు అనేకాలు. ఆత్మ, దేహము మొ॥న వాటికి ద్రష్ట. దేహము జడమైనది, దృశ్యము. ఆత్మ నిర్వికారమైనది. శరీరము వికారాలు కలిగివున్నది. ఆత్మ స్వయంప్రకాశమైనది. శరీరము వేరే దానినుండి ప్రకాశాన్ని పొందేది (పరప్రకాశ్యము). ఆత్మ అన్నింటికీ కారణమైనది (సర్వకారణము). దేహము కార్యమూర్తి. ఆత్మ వ్యాపకము (సర్వవ్యాపి). శరీరము అది ఆక్రమించే ప్రదేశమంత మాత్రమే (ప్రదేశమాత్రమున) వుంటుంది. ఆత్మ నిస్సంగము. దేహము సంగముతో కూడింది (సంగయుక్తము). ఆత్మకు ఆచ్ఛాదన చేసేవి (ఆచ్ఛాదించేవి) ఏమీ లేవు. శరీరానికి ఆచ్ఛాదనగా వస్త్రాలు మొ॥వి వుంటాయి. ఇటువంటి ఆత్మ యొక్క లక్షణాలను తెలుసుకుని జ్ఞానాన్ని పొంది దేహము మొ॥న వాటి పట్ల 'నేను', 'నాది' అనే మోహము నుంచి పుట్టిన మిథ్యా భావనను వదిలివేయి. నిధిలోని రాళ్ళను అగ్నిలో కాల్చడం మొ॥న ఉపాయాల ద్వారా బంగారాన్ని విడదీసినట్లు, వివేకవంతుడు శరీరము అనే క్షేత్రము నుండి ఆత్మప్రాప్తి అనే ఉపాయం ద్వారా బ్రహ్మాన్ని పరిశోధించి తెలిసికోగలడు."

"మాయ, మహత్తత్త్వము, అహంకారము, శబ్దము, స్పర్శ, రూపము, రసము (రుచి), గంధము (వాసన) అనే ఈ ఎనిమిదిటిని ప్రకృతులంటారు. సత్వ, రజస్తమోగుణాలు మాయ యొక్క మూడు గుణాలు. పదకొండు ఇంద్రియాలు, పంచభూతాలు కలిసి 16 వికారాలవుతాయి. 8 ప్రకృతులు, 16 వికారాలు కలిసి 24 తత్త్వాలు. వాటిలోనే ఆత్మ సాక్షిరూపంలో వుంటుంది."

'నేతి, నేతి' అంటే 'ఇది ఆత్మకాదు, ఇది ఆత్మకాదు' అని అన్ని జడపదార్థాలను విడిచిన తర్వాత మిగిలిన చైతన్యమే సత్యమైన ఆత్మ అని తెలుసుకోండి! జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే మూడు వృత్తులు అంటే అవస్థలు బుద్ధికి సంబంధించినవి. ఈ మూడు వృత్తులూ వేటి ద్వారా అనుభవింపబడుతున్నాయో అతడు సర్వసాక్షి,

పరాత్పరుడు అయిన పరమాత్మ అని తెలుసుకోండి!"

"ఇలా ఆత్మస్వరూపాన్ని తెలిసికోండి. సంసారానికి కూడా ద్వారము బుద్ధే! సంసారము కూడా బుద్ధి యొక్క గుణకర్మల చేతనే నిర్మింపబడింది. అవి అజ్ఞానానికి మూలమైనవి కావడం చేత మిథ్య అయినప్పటికీ మానవుడికి స్వప్నం లాగా సత్యముగా కనపడతాయి. ఇవి అన్నీ దేనిలో ప్రతీతములవుతున్నాయో (వుంటున్నాయో), ఏది అధిష్ఠానమైనదో, ఆ బ్రహ్మన్ని తెలిసికొని సంసారానికి బీజమైన (విత్తనమైన) అవిద్యను నశింపజేసి, అతిశయం లేని (నిరతిశయ) సుఖస్వరూపమైన పరబ్రహ్మనే పొందడం ఉత్తమ పురుషార్థము. దానిలోనే మానవజన్మ సార్థకమవుతుంది."

ఇలా ప్రహ్లాదుడు తన తోటి విద్యార్థులకు బోధించాడు.

ఈ సంగతి గురువులకు తెలిసి ఏకాంతంగా ప్రహ్లాదునికి ఇలా చెప్పారు – "నాయనా! ప్రహ్లాదా! నీకు శుభమగుగాక! నిజం చెప్పు. మిగతా పిల్లల మనసులలో కలగని మార్పులు నీ మనస్సులో మార్పులు ఎలా వచ్చాయి? నీ బుద్ధిని ఎవరైనా మార్చివేశారా? లేక నీవే మార్చుకున్నావా?"

ప్రహ్లాదుడు:– రెండూ నిజమే!

**శ్లోకము:**

**స ఏవ ఆత్మా స్వపరేత్యబుద్ధిభిః దురత్యయానుక్రమణో నిరూప్యతే।**
**ముహ్యంతి యద్వర్త్మని వేదవాదినో బ్రహ్మదయోహ్యేష భినత్తిమే మతిమ్॥**

**యథాభ్రామ్యత్యయో బ్రహ్మన్ స్వయమాకర్ష సన్నిధౌ।**
**తథా మే భిద్యతే చేతః చక్రపాణేర్యదృచ్ఛయా॥**

భావం: ఎవరిని వర్ణించడం సాధ్యపడదో, ఎవరిని వెదకడానికి బ్రహ్మాదులు కూడా దారి తప్పుతారో, ఆ పరమాత్మను అవివేకులు స్వ, పర భేదాలతో వివరిస్తారు. ఆ పరమాత్మే నా బుద్ధిని మార్చాడు. ఓ బ్రాహ్మణులారా! సూదంటురాయి (అయస్కాంతము) దగ్గరకు ఇనుము ఆకర్షింపబడినట్లు, భగవంతుని సామీప్యం కోసం నా మనస్సు ఆకర్షింపబడుతోంది. భగవంతుని సామీప్యము నాకెందుకు కావాలనిపిస్తున్నదో నాకు తెలియదు.

ఇలా చెప్పి ప్రహ్లాదుడు మౌనం వహించాడు.

ఈ కారణాల చేతనే భగవంతుని భజించేవారు బాల్యం నుంచే భజించడం మంచిది. వృద్ధాప్యంలో ఏమీ చేయలేరు.

భర్తృహరి యిలా చెప్పాడు –

**శ్లో॥ యావత్స్వస్థమిదం కలేబరగృహం యావచ్చ దూరే జరా।**
**యావచ్చేంద్రియ శక్తిరప్రతిహతా యావత్ క్షయో నాయుషః॥**
**ఆత్మ శ్రేయసి తావదేవ విదుషా కార్యః ప్రయత్నో మహాన్।**
**ప్రోద్దీప్తే భవనే చ కూపఖననం ప్రత్యుద్యమః కీదృశః॥**

భావం: ఈ శరీరమనే గృహము ఆరోగ్యంగా వున్నంతకాలమే, వృద్ధాప్యము చెంతకు రానంతవరకు మాత్రమే, ఇంద్రియ సామర్థ్యము క్షీణించనంతవరకు మాత్రమే అంటే గ్రుడ్డి, కుంటి, మూగ మొ॥న లక్షణాలు రానంతవరకూ మాత్రమే, మృత్యువు సమీపించనంతవరకూ మాత్రమే ఆత్మశ్రేయస్సు కోసం మానవుడు ప్రయత్నించాలి. ఎవరైనా 'వృద్ధాప్యంలో మోక్షం కోసం ప్రయత్నించవచ్చు' అని అనుకుంటే అది ఇంటికి నిప్పు అంటుకున్న తరువాత బావి తవ్వడానికి ప్రయత్నించడం లాంటిది".

ఈ సంభాషణ తరువాత చాలా ఆలస్యమవడం చేత అందరూ నిద్రించడానికి వెళ్ళిపోయారు.

**- సశేషం**

# 15వ ప్రసంగము సమాప్తం

# బుద్ధ ధ్యాన హృదయము

(గత సంచిక తరువాయి)

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

## అధ్యాయం - 5

### శిక్షణాక్రమము

1) సామాన్య స్మృతిసాధన : నిర్దుష్టమైన శిక్షణ చేసేటప్పుడు సాధనకు కాలపరిమితి లేదు. రోజంతా (వుదయం నుండి సాయంకాలము వఱకు) సాధనా సమయమే. అయితే ఆ సమయమంతా ఒకే ఒక్క ప్రధానమైన ధ్యేయ వస్తువుపై దృష్టిని లేక స్మృతిని కేంద్రీకరించాలని కాదు. ఎంతవరకు తనకు సాధ్యమో అంతవరకూ అలానే చేస్తాడు. అయితే మధ్యలో ఆ స్మృతి తొలగివుండే సమయాలుంటాయి. ఆరంభంలో అవి తరచుగాను, దీర్ఘంగాను వుంటాయి. ఈ విరామ సమయాలలో గూడ స్మృతి అనే ధార తెగకుండా, పట్టుసడలకుండా చూచుకోవాలి. ప్రధాన ధ్యేయవిషయంపై నిలువకపోయినా తక్కిన క్రియాకలాపాలను, ఇంద్రియానుభవాలను సాధ్యమైనంత యెక్కువ స్మృతితో కొనసాగించాలి. నిద్రమేల్కొగానే మొట్టమొదటి యింద్రియానుభూతి, మొదటి ఆలోచనలతో ప్రారంభించి రోజులో చిట్టచివరి అలోచన యింద్రియానుభూతి దాకా (అంటే నిద్రపట్టే క్షణం వరకు) అన్నింటిపైన తీవ్రమైన స్మృతి కలిగి వుండాలి. దీనిని సామాన్య స్మృతి సాధన అంటారు.

ఇందులో ప్రధానం నాలుగు శారీరక వైఖరులు – పోవడం, నిల్చోవడం, కూర్చోవడం, పడుకోవడం. అంటే ప్రస్తుతం మన శరీరం యెట్టి స్థితిలో వున్నదో అన్న విషయాన్ని అప్పుడప్పుడు దానిలో వచ్చే మార్పులను, అవి మార్చుకోవాలనుకునే సంకల్పాన్ని, ఆ వైఖరిలో అంశమైన శారీరకానుభూతి (నేల, వత్తిడి మొదలైనవి), వాటివల్ల కలిగే సుఖాదిభావాలపట్ల స్మృతి కలిగివుండాలి. ఉదా: రాత్రి పడుకునేటప్పుడు, పొద్దున లేవబోయే ముందు తాను పడుకున్న వైఖరి, అందులోని పడకయొక్క స్పర్శ మొదలైన వాటిపట్ల స్మృతి కలిగి వుండాలి.

స్మృతిని సక్రమంగా కొన్ని కదలికల పరంపరకు యెలా వర్తింపజేయాలో ఒక్క వుదాహరణం. పొద్దున్నే ముఖం కడుక్కోవాలి అనే కోరిక జనించింది. ఆ కోరిక జనించడాన్ని గుర్తించాలి. (ఇదే భావనా స్మృతి: "తన మానసిక స్థితిని, దాని యొక్క విషయాన్ని గుర్తిస్తాడు" అని సూత్రం చెబుతుంది). కొంచెందూరంలో గిన్నెతో నీళ్ళగ్లాసును చూస్తాడు. (ఇది దృష్టి చైతన్యము, చూచుట అను క్రియను గుర్తించాలి). అతడు ఆ పాత్రను సమీపిస్తాడు. (ఈ పోవుట అను శారీరక వైఖరిని గుర్తించాలి). ఆ పాత్ర దగ్గర నిలుస్తాడు. (నిలుచుట అనే శరీరవైఖరిని గుర్తిస్తాడు). నీటి పాత్రకోసం చేయిచాస్తాడు (వంగి చేయిచాపడాన్ని గుర్తిస్తుంటాడు). పాత్రను పట్టుకుంటాడు (స్పర్శను గుర్తిస్తాడు) ఇలాగే తక్కివ పనులన్నీ చేయాలి.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# భగవాన్ శ్రీ భరద్వాజ

శ్రీమతి శ్రీదేవి

## అధ్యాయం - 5

## సాధన - పరిశోధన

ఈ విధంగా ఒకవైపు ఆయన కఠిన సాధనలు చేస్తూనే మరోవైపు సంఘ సంస్కరణ వైపు దృష్టి సారించారు. ఆయన విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించటం వరకు మాత్రమే పరిమితం కాలేదు. వారిలో క్రమశిక్షణ, ఋజువర్తనల ద్వారా నైతిక విలువలను పెంపొందించాలనీ, తద్వారా ధర్మబద్ధమైన శాంతియుత సహజీవనం సాగించే నవ సమాజాన్ని నిర్మించాలనీ, దుఃఖరాహిత్యస్థితిని పొంది సకల మానవాళి ఆనందమయ జీవితాలను గడపాలనీ ఆయన ఆకాంక్షించారు. ఆ ఆశయంతో ఆయన విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు ఎన్నో జీవిత పాఠాలను బోధించేవారు. సంఘసంస్కరణమనే ఆశయ సాధనలో భరద్వాజగారి అన్నగారైన వేదవ్యాస్ గారు కూడా సహకరించేవారు. తమ ఆశయసిద్ధికై జన బాహుళ్యంలో విస్తారంగా ధర్మప్రబోధం గావించేటందుకై ఆ అన్నదమ్ములిరువురూ వేసుకొన్న ఎన్నో ప్రణాళికలలో ఒక భాగం పత్రికల ద్వారా ప్రచారం చేయటం. ఆ ఆలోచనా ఫలితంగా వారిరువురూ కలసి 'కృతయుగ' అన్న పేరుతో ఒక పత్రికను ప్రారంభించారు.

ఆ పత్రికలో మన సంస్కృతి, సంప్రదాయాలు, ఉత్తమ జీవన ప్రమాణాలను చాటి చెప్పే వ్యాసాలు, అందుకు స్ఫూర్తిదాయకాలైన పౌరాణిక, సమకాలిక మహాపురుషుల జీవితచరిత్రలు, బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస ధర్మాల వివరణలు - ఈ విధంగా పలు అంశాలు ప్రస్తావించబడేవి.

శ్రీ భరద్వాజగారి పెద్దన్నగారైన శ్రీ కృష్ణమాచార్యులుగారి శిష్యుడు శ్రీ పున్నయ్య శాస్త్రిగారు 'కృతయుగ' మేగజైన్ లో బ్రహ్మచర్య ఆశ్రమ ప్రాశస్త్యాన్ని గురించి భరద్వాజగారు వ్రాసిన వ్యాసాలను చదివి ఎంతగానో ప్రభావితులై తను ఆజన్మ బ్రహ్మచారిగా వుండిపోవాలని నిర్ణయించుకొన్నారు. అయితే కాలాంతరంలో ఆయన తమ గురువు ఆదేశాన్ననుసరించి వివాహం చేసుకొనటం జరిగింది. ఆ విధంగా ఎందరో ప్రజలు 'కృతయుగ' పత్రికలోని వ్యాసాలను చదివి సన్మార్గం వైపు నడిచేవిధంగా ప్రభావితులౌతుండేవారు.

భరద్వాజగారు తమ సాధనలో భాగంగా అప్పుడప్పుడు అడవులలోకి ఒంటరిగా వెళ్ళి కొన్ని రోజులు సాధనలో గడిపి తిరిగి వస్తుండేవారు. ఒకసారి ఆయన అదే విధంగా మూడురోజులు అడవులలో వున్నారు. ఆ మూడు రోజులూ ఎలాంటి ఆహారము లేకుండా వుండటంతో ఆయనకు తీవ్రమైన ఆకలి వేసింది. అడవి నుండి బయలుదేరి కొన్నిమైళ్ళు నడచి ఒక గ్రామం చేరుకున్నారు. అప్పటికి రాత్రి చాలా సమయం గడచింది. ఎక్కడా భోజనం దొరకలేదు. చివరకు ఒక చిన్న హోటల్ కనిపిస్తే వాళ్ళు కూడా తమ వద్ద ఏమీ పదార్థాలు మిగలలేదనీ, రెండు మూడు రోజుల క్రిందట వండిన అన్నం ఒక పాత్రలో వుందనీ అది బాగా చెడిపోయి తినటానికి ఏ మాత్రం యోగ్యంగా లేదనీ చెప్పారు. ఆయన ఆ అన్నాన్నే అడిగి పెట్టించుకొని సంతోషంగా తిని ఆకలి తీర్చుకున్నారు.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

**శ్రీమతి శ్రీదేవి**

అస్వస్థులుగా వున్న జ్యోతిష్ దాదాకు తోడుగా తాము కూడా చటగామ్ వెళ్తామని అక్కడ వున్న భక్తులు చాలామంది అమ్మతో చెప్పారు. కానీ అమ్మ అందుకు ఒప్పుకోలేదు. అమ్మ శ్రీ గురుప్రియ తండ్రి శ్రీ అఖండానందగిరిస్వామి వైపు చూస్తూ, "నీ వుద్దేశం యేమిటి?" అన్నారు. ఆయన, "అమ్మా! మీరు మాకు యెటువంటి ఆదేశాలిచ్చినా వాటి గురించి మాకు వేరే వుద్దేశాలు, అభిప్రాయాలు యేముంటాయి? మీరు యేది చెప్పినా దానిని చేసేందుకు మాకు అభ్యంతరం యేమి వుంటుంది? అయితే జ్యోతిష్ దాదా అనారోగ్యంగా వున్నారు కనుక, వీరి వెంట పురుషులు యెవరైనా తోడుగా వెళ్తేమంచిది కదా?" అన్నారు. వెంటనే అమ్మ గురుప్రియను చూపిస్తూ "మన గురుప్రియ పురుషుడే కదా! అందరూ ఆమెను 'బ్రహ్మచారి దాదా' అని పిలుస్తుంటారు. ఆమె వెళ్తున్నది కదా!" అన్నారు. అక్కడ వున్న భక్తులెవ్వరికీ అమ్మ నిర్ణయం నచ్చకపోయినా యేమీ అనలేక మౌనం వహించారు. నిర్ణీత సమయానికల్లా జ్యోతిష్ దాదా, గురుప్రియ చటగామ్ వెళ్ళిపోయారు. చటగామ్‌లో కొద్దినెలలు గడిచాయి ఒక రోజు ఢాకా నుండి గురుప్రియకు టెలిగ్రాం వచ్చింది. అమ్మ ఢాకా వచ్చారనీ, ఢాకాలో యేడు రోజులుంటారనీ, కనుక ఢాకా వచ్చి అమ్మను దర్శించుకొనవలసిందిగా భక్తులు టెలిగ్రాం యిచ్చారు. ఎంతో ఆనందంతో జ్యోతిష్ దాదా, గురుప్రియ ఢాకా చేరుకున్నారు.

సుమారు 4 సంవత్సరాల తర్వాత అమ్మ ఢాకా వచ్చారు. అమ్మ రాకతో ఢాకా పట్టణ ప్రజలంతా ఆనందంతో పొంగిపోయారు. రమణాశ్రమం భక్తులతో క్రిక్కిరిసి పోయింది. అమ్మ ఢాకాలో యేడు రోజులున్నారు. ఆ యేడు రోజులూ భక్తులంతా అమ్మను, శ్రీ భోలానాథ్ గారినీ ఒక్కక్షణం కూడా వదిలి పెట్టలేదు. పూజలు, భజనలు, ఆధ్యాత్మిక చర్చలు, అన్న సంతర్పణలు! రోజంతా ఆశ్రమంలో యెంతో కోలాహలం, సందడి! భక్తుల ఆనందం అవధులు దాటింది. ప్రతిరోజూ సాయంకాలం జరిగే సంకీర్తనలలో అమ్మ కూడా పాటలు పాడటం, భజన చెప్పటం జరిగేది. సాధారణంగా అమ్మ పాటలు పాడాలని అనుకొన్నపుడు యెక్కువగా యీ క్రింద తెలిపిన రెండు పాటలను పాడుతుంటారు.

**1. ఆరామ్ హలోకిప్యారామ్। కేవల హరి రామ దూర్వాదల శ్యామ జటాధారీ।**
**బిమానే ధరాతే, సమ్ముఖే పశ్చాతే। దక్షిణ వామేతే, రామ ధనుషధారీ।**
**కోథా గేలో తేజ, ఇంద్రియ నిస్తేజ, కఫ, పిత్త, ఆయు హాయలోసతేజ।**
**ఏ మకరధ్వజే, నాషి చేసే తేజే, కాలక్రమేనేజే, అంతరే బిపరి।**

**2. సుషుమ్నా, ఇడా, పింగళా, త్రిశరా, వేగేకహే తారా, రాఖి తేనారీ।**
**కికరి కికరి, కిసేప్రాణధరి, హాయిలో దుర్బల సబలా నాది।**
**సంచిత ఆవల్యే, నయన మృది లే, రామబోలే, ప్రాణవుతే శిహరి।**
**బటి తారరామ్, పయ్య తారరామ్, రామ్ అనుపానే, భువనేతరి।**
**రామకష్ట రోగే, రామకాల భోగే, రామ బినేకి, ఆర ఔషధ, ఆభేతారి।**
**భావి లేసే, రామ త్రిదోషస్యారామ, కతజే ఆరామ బలితే నారి।**

**- సశేషం**

# ద్వారకామాయి అనుభవమండపము

*శ్రీ శివకుమార్, బెంగళూరు.*

పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు రచించిన, శ్రీసాయిలీలామృతము గ్రంథ పారాయణకు ముందు వేరువేరు రచయితలు శ్రీ శిరిడి సాయిబాబా వారి పై వ్రాసిన గ్రంథాలు చదివాను. నాకు అందులో సంఘటనలు వివరించిన తీరుగాని, శైలిగాని నచ్చలేదు. తర్వాత శ్రీ హేమద్పంతు రాసిన సచ్చరిత్ర అనువాదం కూడా చదివాను. అందులో కూడా కొన్ని సందేహాలు వచ్చాయి. తర్వాత కొంతకాలానికి బెంగళూరులోనే వుంటున్న నా స్నేహితుడు ప్రసాద్ గారు 'శ్రీసాయిలీలామృతము' గ్రంథం తీసుకొచ్చి నాకు యిచ్చి 'ఒకసారి చదువు' అని చెప్పడం జరిగింది. నేను ఈ గ్రంథం కూడా ఇంతకుముందు చదివిన గ్రంథాల లాగే వుంటుందని అనుకుని, ఒక నవల చదివినట్టు చదవడం ప్రారంభించాను. కానీ చిత్రంగా, నాకు ఇదివరకు చదివిన ఏ గ్రంథాలలోనూ సమాధానం దొరకని ఎన్నో ప్రశ్నలకి ఈ గ్రంథంలో సమాధానాలు దొరికాయి.

ముఖ్యంగా, నాకు కూడా ఒక గురువుగారు మంత్ర దీక్షిస్తాను తీసుకోమని, నీ ఇష్టదైవం ఎవరు? అని అడిగారు, నేను 'శిరిడీ సాయిబాబా' అని చెప్పాను, అప్పుడు ఆయన, "సమాధి అయినవారు నీకు ముక్తి ఇవ్వలేరు, కనుక వారిని పూజించడం తగదు" అని చెప్పారు. సరిగ్గా శ్రీసాయిలీలామృతము గ్రంథం గురుస్తుతి లో అఖండానంద సరస్వతి ఉదంతంలో దీనికి పూజ్యశ్రీ మాస్టరుగారు వివరణ యిచ్చారు. ఇక అప్పటినించి ఆ గ్రంథం చదివే తీరు మారిపోయింది. విపరీతమైన గౌరవభావం కలిగింది.

అదేవిధంగా సకల సాధు స్వరూపము, సకల దేవతా స్వరూపము, విశ్వరూపము అధ్యాయాలు, చదివాక, అన్నీ సాయిబాబా నే. ఈయన తిరుగులేని గురువు, వీరిని శరణాగతి చెందవచ్చు అని నిర్ణయించుకున్నాను. వెంటనే నా స్నేహితుడు ప్రసాద్ గారితో, 'నాకు ఒంగోలు వెళ్లి, పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి దర్శనం చేయాలనుంది' అని అడిగాను. ఆయన చాలా సంతోషించి నన్ను ఒంగోలు, విద్యానగర్ తీసుకువెళ్లారు. ఈవిధంగా నాకు ఒకటేసారి శ్రీ సాయినాథుని, శ్రీ భరద్వాజుని దర్శన ఆశీస్సులు అద్భుతంగా జరిగాయి.

నాకు శ్రీ సాయినాథుని పరిచయ భాగ్యం మొట్టమొదట మా పెద్దనాన్నగారి వల్ల కలిగింది. మేము మరాఠీ స్మార్త సంప్రదాయానికి చెందిన వాళ్ళము. బెంగళూరులో నివాసం ఏర్పరచుకున్నాం. మా కులదేవత ఖండోబా! మా అమ్మగారు దత్త సంప్రదాయకులైన శ్రీధర్ గురువుగారిని అనుసరిస్తారు. వారు మా గృహానికి కూడా విచ్చేశారు. మా ఇంట్లో ఎవ్వరూ శిరిడీ బాబాని అనుసరించరు, పూజించరు. కానీ మా పెద్దనాన్నగారు శిరిడీ సాయిని అనుసరించేవారు. వారి సాంగత్యంతో

నాకు బాబా గురించి తెలిసింది. మా పెద్దనాన్నగారు శ్రీ వినాయకరావుగారు, చెన్నైలో ఐనవరం లో వుండేవారు. ఆయనకు 9 సంవత్సరాలు వయసున్నప్పుడు ఒక స్వప్నం వచ్చిందిట. అందులో,,, ఒక పోస్ట్ కార్డు సైజులో బాబా ఫోటో వుండి, దాని వెనక ఒక వాక్యం వుంది, “బిహైండ్ వాకాఫ్ యువర్ లైఫ్ ఐ యాం విత్ యు, బై శిరిడి సాయిబాబా”అని!!. అప్పటికి శిరిడి సాయిబాబా గురించి వారికి ఏమీ తెలియదు.

ఒకసారి మా పెద్దనాన్నగారు కొంతమందితో కలిసి ఒక చోటికి బయలుదేరారు. వాళ్ళందరూ కొంత దూరం వెళ్ళాక ఈయన్ని ఒకచోట 'నువ్వు యిక్కడ వుండు. మేము యిప్పుడే వస్తాము' అని చెప్పి వాళ్ళు పక్కనే వున్న ఒక ఇంటికి వెళ్లారు. అక్కడ చుట్టూ వున్న ప్రదేశం చూస్తూ ఉంటే వెనుక వైపు ‘శిరిడి సాయిబాబా భజన మండలి’ అని ఒక బోర్డు కనిపించింది. ఇదేంటో చూద్దామని లోపలికి వెళ్తే, వారికి స్వప్నంలో వచ్చిన కార్డు మీద ఏ ఫోటో ఉందో అది అక్కడ పటం రూపంలో వారికి దర్శనం ఇచ్చింది. అప్పుడు మా పెద్దనాన్నగారు కొంతసేపు అక్కడ గడిపి తిరిగి వచ్చేటప్పుడు, బాబాని ఒక కోరిక కోరారు. వారి కుటుంబానికి ఒక సమస్య ఉండేది, ఏమిటంటే ఈయన తర్వాత పుట్టిన పిల్లలు అందరూ చనిపోతూ ఉండేవారు.

అందువల్ల ‘బాబా నా తర్వాత పుట్టిన వారు బ్రతికితే, వారికి నీ పేరు పెట్టుకుంటాము అని నమస్కారం చేసుకొని వచ్చారట’. వారు చిన్న వయసునుండి చాలా విలక్షణంగా ఉండేవారు. తర్వాత మా నాన్నగారు పుట్టారు. వారికి ‘సాయి మల్లారి రావు’ అని పేరు పెట్టారు. మాల్లారి అంటే ‘ఖండోబా’ అని అర్థం.

కొంతకాలం తర్వాత మా పెద్దనాన్నగారికి బివి నరసింహస్వామి శిష్యులు శ్రీ రాధాకృష్ణ స్వామి వారికి ప్రత్యక్షంగా సేవ చేసుకునే భాగ్యం కలిగింది..

వారికి ఒకసారి స్వప్నంలో ఆజానుబాహు వొకరు మొల వరకు నీళ్లల్లో నిలబడి కనిపించారట. తర్వాత కొన్నాళ్ళకి మా పెదనాన్నగారు, సదాశివబ్రహ్మేంద్ర స్వామి జీవసమాధి దర్శనానికి వెళ్లారు. అక్కడ ఎవరో ‘స్వామి చరిత్ర ఇంతవరకు ఎవరూ రాయలేదు, మీరు కన్నడలో, ఇంగ్లీషులో ఈ చరిత్ర రాయవలసింది’ అని అర్థించారట. మా పెద్దనాన్నగారు ఇది నా వల్ల అవుతుందా అని ఆలోచిస్తూ,, సదాశివ బ్రహ్మేంద్రస్వామి జీవ సమాధికి సాష్టాంగ ప్రణామం చేసి కళ్ళు తెరవగానే అక్కడ బాబా ఫోటో ఎదురుగా పడి ఉందట. అప్పుడు ధైర్యంగా, ఇది బాబా ఆజ్ఞగా స్వీకరించి, కన్నడలో, ఇంగ్లీషులో వారి జీవిత చరిత్ర రాయడం జరిగింది. అదేవిధంగా మా పెద్దనాన్న గారు, నేను, కలిసి మరాఠీ లో వున్న శిరిడీ హారతుల్ని కన్నడ భాషలోనికి అనువాదం చేసాం.

మా పెద్దనాన్నగారు ఒక నాలుగు ఐదు రోజుల్లో శరీరం వదిలేస్తారనగా, అనారోగ్య కారణంగా వారిని ఆసుపత్రిలో చేర్చటం జరిగింది. అప్పుడు, శ్రీ బాబావారు, స్వప్న దర్శనమిచ్చి, వారితో సంస్కృతంలో సంభాషించారట. అందులో భాగంగా “యోగః ప్రతీయతే” అనే మాట చెప్పారట. అంటే, ఈ జన్మలో నీ శరీరం ఎంతవరకు తట్టుకోగలదో, అంతవరకు యోగ సాధన చేశావు. ఇప్పటికి ఇది చాలు. ఇక తర్వాత జన్మలో, నీ సాధనకు ఉపయోగపడే శరీరం, పరిస్థితులు నీకు లభిస్తాయి. అప్పుడు మిగతాది పూర్తిచేద్దువు గాని” అని దాని అంతరార్థమట. మా పెద్దనాన్నగారు, పతంజలి యోగ సూత్రాలు, క్రియా యోగము మొదలైనవి అనుష్టించేవారు. అందువల్ల బాబా అలా స్వప్నంలో సూచన చేశారేమో. తరవాత ఆయన 50 వేల రూపాయలు వారి అంతిమ సంస్కారానికి ఏర్పాటు చేసుకొని, వినాయక చవితి మరునాడు ఋషి పంచమి రోజు శరీరాన్ని వదిలిపెట్టారు.

ఈ విధంగా నాకు మా పెద్దనాన్నగారి ద్వారా శ్రీ శిరిడి సాయినాథులు వారి పరిచయ భాగ్యం కలగడం జరిగింది. తర్వాత నన్ను పూర్తిగా శ్రీ శిరిడి సాయినాథులవారు వెన్నంటి వుండి, పూజ్యశ్రీ

***మిగతా 29వ పేజీలో***

# ఆచార్యుని అద్భుత లీలలు

***శ్రీమతి హేమ, డల్లాస్(U.S.A.)***

పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవుల లీలా వైభవాన్ని అమెరికాలోని డల్లాస్ ప్రాంతంలో నివాసముంటున్న శ్రీమతి హేమగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు.

నేను చిన్నప్పటినుంచి చాలా బాగా చదివేదానిని. కనుక ఈసెట్ సీటు వస్తుందనుకున్నాను. కానీ రాలేదు. అప్పుడు మా అమ్మగారు నాకు శ్రీసాయిలీలామృతము గ్రంథమిచ్చి పారాయణ చేయమన్నారు. ఆ గ్రంథం చదివాక, 'ఎంత బాగా వ్రాశారో!' అనుకున్నాను కానీ వ్రాసిన వారి గురించి ఆలోచించలేదు. మళ్ళీ ఒక సంవత్సరం తరవాత పరీక్షలో ఉత్తీర్ణురాలినయ్యాక బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీలో సీటు వచ్చింది. అక్కడ హాస్టలులో వుండి చదువుకునేదాన్ని. నేను బాపట్లనుంచి మా ఊరు అంటే విజయవాడ వెళుతున్నప్పుడు రైల్లో ఎక్కువగా శ్రీసాయిలీలామృతం పారాయణ చేసుకునేదాన్ని.

ఒకసారి రైల్లో గళ్ళ లుంగీ కట్టుకున్న ఒకాయన నా ఎదురుగా కూర్చున్నారు. నేను యథాప్రకారం శ్రీసాయిలీలామృతం పారాయణ చేసుకుంటున్నాను. ఆయన నన్ను పెద్దగా చదవమన్నారు. సరేనని పెద్దగా చదువుతుంటే ఉపవాసానికి సంబంధించిన లీల వచ్చింది. అప్పుడు ఆయన, "నువ్వు ఉపవాసాలు చేస్తావా?" అని అడిగారు. నేను "గురువారం ఉపవాసం చేస్తాను" అని చెప్పాను. "అన్నం తినకుండా వుండగలవా?" అని అడిగారు. "వుండలేను" అన్నాను. "ఉపవాసాలు చేయవద్దని బాబా చెప్పారు కదా!" అన్నారు. "చెప్పారు కానీ వారానికి ఒక్కరోజైనా తినకుండా వుందామని అలా చేస్తున్నాను" అన్నాను. వెంటనే ఆయన ఒకరకంగా చిరునవ్వు నవ్వారు. ఇలా కొంతసేపు సంభాషణ జరిగాక ఆయన సంచీనుంచి ఒక చిత్రపటం తీసి, "ఇది బాబా నిజమైన చిత్రపటం. 'ఎవరికి కావాలి?' అని నన్ను తప్ప అందరినీ అడుగుతున్నారు. నన్ను అడగలేదు కదా అని నేను మౌనంగా చదువుకుంటున్నాను. మళ్ళీ ఆయనే ఆ చిత్రపటాన్ని నా పుస్తకంలో పెట్టారు. నేను దానిని చూస్తూ వున్నప్పుడు తెనాలి స్టేషన్ వచ్చింది. వారు రైలు దిగిపోయారు. ఒక్క రెండు క్షణాలు గడిచాయో లేదో! నేను కూడా వారి వెనకే రైలు దిగాను. పటం ఇచ్చినందుకు కృతజ్ఞతలు చెబుదామని ఆయన కోసం చుట్టూ చూశాను. స్టేషన్లో జనం ఎక్కువగా లేరు. అయినా ఎంత వెతికినా వారు నాకు కనిపించలేదు!! వారు ఎవరై వుంటారోననే ఆలోచన కూడా రాలేదు.

తరువాత చాలారోజులకు 'మహాత్ముల ముద్దుబిడ్డడు' గ్రంథం చదువుతుంటే పూజ్యశ్రీ మాస్టరుగారి వర్ణన వచ్చింది. వారు గళ్ళలుంగీ కట్టుకుంటారని తెలిసింది. వెంటనే నాకు ఆ రోజు రైల్లో కనిపించిన వ్యక్తి గుర్తుకువచ్చారు. ఆ గ్రంథంలోని వర్ణనను బట్టి నాకు ఆ

రోజు రైలులో దర్శనమిచ్చినది పూజ్యశ్రీ మాస్టరుగారేనని అర్థమై పులకించిపోయాను. అంతేకాదు!!! ఆరోజు రైలులో ఉపవాసం గురించి చర్చ జరిగిన దగ్గరనుంచి ఎంత ప్రయత్నించినా ఏదో ఒక కారణంతో నాకు ఉపవాసం చేయడానికి కుదరనే లేదు!! వారు ఒకరకంగా నవ్విన నవ్వుకి అర్థం అప్పుడు తెలిసింది. అంటే ఉపవాసం వద్దని బాబా చెప్పినా ఆయన బోధను విస్మరించిన నన్ను సరిదిద్దారన్నమాట!!

నేను భవానీపురంలో రాజాగారు నిర్వహించే సత్సంగాలకు హాజరయ్యేదానిని. అక్కడ పూజ్యశ్రీ మాస్టరుగారి మందిరం కూడా వుండేది. తరువాత ఒంగోలులోని బాబా గుడిని, పూజ్యశ్రీ మాస్టరుగారి బృందావనాన్ని దర్శించుకున్నాను. అప్పటినుంచి పూజ్యశ్రీ మాస్టరుగారంటే గౌరవభావం పెరిగింది. ఇంజనీరింగ్ పూర్తయ్యాక ఉద్యోగానికి హైదరాబాదుకు వచ్చాను. అక్కడ ఎక్కువగా పంజాగుట్ట బాబా గుడికి వెళుతుండేదాన్ని. తరువాత నాకు వివాహం జరగడం, మావారు సౌత్ ఆఫ్రికా వెళ్లడం జరిగిపోయాయి. నాకు బాబు పుట్టాడు. నేను విజయవాడలోనే వుండేదానిని. పూజ్యశ్రీ మాస్టరుగారి మందిరానికి వెళ్ళినప్పుడల్లా వారు గొప్పవారు అనిపించేది. కానీ గురుతుల్యులని కానీ అంతకుమించిన గొప్ప భావన కానీ కలిగేది కాదు.

ఒకసారి ఒక సత్సంగసభ్యుడు 'మహాత్ముల ముద్దుబిడ్డడు' గ్రంథం చదవమని నాకు ఇచ్చారు. ఇంటికి వెళ్లిన వెంటనే చదివాను. అప్పుడే మహాద్భుతం జరిగింది. ఆ గ్రంథం చదువుతున్నంతసేపూ పూజ్యశ్రీ మాస్టరుగారు నా పక్కనే వుండి చదివిస్తున్నారన్న అనుభవం కలిగింది. చాలా స్పష్టంగా ఆయన సన్నిధిని అనుభవించాను. ఇక అప్పటినుంచి ఆయనే నాకు భగవంతుడు, గురువూ అనిపించింది. ఇది నాకు స్ఫురించిన భావన కాదు. పూజ్యశ్రీ మాస్టరుగారి అనుగ్రహం. అప్పటినుంచి దత్తుడు, బాబా, పూజ్యశ్రీ మాస్టరుగారు వేరు కాదు, ఉన్నది ఒకే ఒక్కరు, వారే పూజ్యశ్రీ మాస్టరుగారు. మా ఇంట్లో పూజ్యశ్రీ మాస్టరుగారి పటాలు మాత్రమే వుంటాయి. ఏ పండగైనా ఆయనకే పూజ చేసుకుంటాము. ఏదైనా ఆయనతోనే చెప్పుకుంటాను.

మావారు సౌత్ ఆఫ్రికానుంచి వచ్చాక ఉద్యోగరీత్యా మేము చెన్నయ్ వెళ్ళాము. అంతకుముందే నేను టి.డి. కృష్ణమూర్తిగారి దగ్గర భావాతీతధ్యానం(TM) నేర్చుకున్నాను. చెన్నైలో ఒకరోజు నేను ధ్యానంలో వుండగా ఒక దృశ్యం కనిపించింది. పూజ్యశ్రీ మాస్టరుగారు గొంతుకు కూర్చుని మూతలేని ఖాళీ సీసాని ఊదుతున్నారు. దానిలోంచి నల్లటిపొగ బయటకు వస్తోంది. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు ఇలా చెప్పారు.. "ఈ నల్లటి పొగ నీ వాసనలు, నీ చెడు కర్మలు, వాటి ఫలితాలు. నీలోపల అంతా ఖాళీ అనుకుంటున్నావు. కానీ ఇవన్నీ వున్నాయి" అని చూపిస్తున్నారు. నాకు అంతా అర్థమైంది. పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పింది అక్షరసత్యం. నేను చదువుకునే రోజులలో కళాశాలకు వెళ్లిరావడం, చదువు – ఇవే వుండటం వల్ల మంచి భావాలు, మంచి ఆలోచనలతో ప్రశాంతంగా వుండేదానిని. కానీ నాకంటూ ఒక ప్రపంచం ఏర్పడి, బాధ్యతలు పెరిగాక నా మానసికస్థితిలో ఇదివరకు వున్నంత బలం లేదనిపించింది. ఆ దృశ్యాన్ని పూజ్యశ్రీ మాస్టరుగారు కళ్ళకు కట్టినట్లు చూపిస్తూ నా చెడు వాసనలను, చెడు కర్మలను, వాటి ఫలితాలను క్షాళన చేస్తున్నారు. నామీద వారికెంతటి కరుణ! సరైన వైద్యుడి చేతిలో పడినప్పుడు రోగికి భయపడవలసిన అవసరం ఏముంది?

2021లో మేము USA వచ్చాము. 2023లో ఒక భయానక సంఘటన జరిగింది. మా ప్రాణాలు పోకుండా పూజ్య గురుదేవులు కాపాడిన తీరు అసామాన్యం.

డల్లాస్ లో మేముండేచోట ఇళ్లన్నీ చెక్కతో చేసినవే. ఈ సంవత్సరం జనవరిలో ఒకరోజు తెల్లవారుఝామున 5 గంటలకు మా పక్క ఫ్లాట్ లో క్రింది అంతస్తులో అగ్నిప్రమాదం జరిగి మంటలు పైఅంతస్తు వరకూ వచ్చి మొత్తం కాలిపోయింది. దానిని ఆనుకుని మా ఫ్లాట్ వుంది. మా ప్రక్కవాళ్ళకి మాకు హద్దు ఒక చక్క గోడ మాత్రమే. నిజానికి ఆ మంటల వేగానికి చాలా తేలికగా మా ఇల్లు కాలిపోయి వుండవలసింది. వెంటనే మేమందరం బయటకు వచ్చేశాము. మా ఇల్లు కూడా అంటుకుపోతుందనుకున్నాము. మేము చాలా భయపడ్డాము. అగ్నిమాపకదళం వారి తీవ్రప్రయత్నంతో

ఆ మంటలు చల్లారాయి. ఆ హద్దు గోడ పక్కన మా స్నానాలగది వుంటుంది. తరువాత ఇంట్లోకి వచ్చి చూస్తే, ఆ గదిలో వున్న చెక్క పొగచూరి వుంది. అంటే నల్లగా అయింది. ఒక్కసారిగా ఎంతటి ప్రమాదం తప్పిందో అర్థమవ్వగానే అదురుతున్న గుండెలతో హాలులోకి వచ్చి సోఫాలో కూర్చుని ఎదురుగా వున్న పూజ్యశ్రీ మాస్టారుగారి చిత్రపటం వైపు చూశాను. చిత్రంగా ఆ పటం తల్లక్రిందులుగా వుంది. వెంటనే నా మనసుకి 'జరగవలసిన పరిస్థితిని తలక్రిందులు చేశాను' అని చెప్తున్నట్లనిపించి, కృతజ్ఞతతో రెండు చేతులూ జోడించి సోఫానుంచి ఒక్కసారి మోకాళ్ళ మీద క్రిందకు కుప్పకూలిపోయాను! అంత ఆపదనుంచి మా కుటుంబాన్ని కాపాడినందుకు గుర్తుగా వెంటనే అలా తల్లకిందులుగా వున్న వారి చిత్రపటాన్ని ఫోటో తీశాను.

ఇలా మమ్ములను కంటికి రెప్పలా కాపాడుతున్న వారి కృపా కటాక్షవీక్షణాలకు వినమ్రపూర్వకంగా శరణాగతి చెందడమే నేను చేయవలసినది. అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ!! ●

## ద్వారకామాయి అనుభవ మంటపము

27వ పేజీ తరువాయి

మాస్టరుగారి, పూజ్యశ్రీ అమ్మగార్ల పరిచయ భాగ్యం కల్పించి, పూజ్యశ్రీ మాస్టరుగారి రచనలు కొన్ని అనువాదం చేసే అవకాశం, పూజ్యశ్రీ అమ్మగారి ద్వారా కల్పించడం జరిగింది.

ఇక్కడ ఒక ముఖ్యమైన లీల చెప్పాలి. నేను శ్రీ సాయి లీలామృతము గ్రంథాన్ని కన్నడలోకి అనువాదం చేసినప్పుడు, శ్రీ రమేష్ కాకా ప్రూఫ్ రీడింగ్ లో సహకారాన్ని అందించారు.. అయితే వారికి పుట్టినప్పటినుంచి కంటి సమస్య ఉంది. అంటే పూర్తిస్థాయిలో వారికి దృష్టి ఉండదు. చిన్న చిన్న అక్షరాలు చదవడం కష్టం. భూతద్దం సహాయంతో వాటిని పెద్దగా చేసుకుని చదువుతారు. అయితే వారికి శ్రీ సాయిలీలామృతము ప్రూఫ్ రీడింగ్ సమయంలో ఆ గ్రంథంలో అక్షరాలు చాలా బాగా కనిపించేవి. ఇది పూర్తిగా బాబాగారు వారికి ఇచ్చిన అనుగ్రహం.

నేను కొంతకాలం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకత్వం చేశాను. ఇప్పుడు ఆ గుడిలో లేను కానీ, అదే వృత్తిని కొనసాగిస్తున్నారు. కానీ వీటన్నిటికంటే ముందు మెడికల్ రెప్రజెంటేటివ్ లాంటి ఉద్యోగాలు కొన్ని చేశాను. కానీ ఏవి నాకు కలిసి రాలేదు. అసలు నేను ఇటువంటి ఉద్యోగాలు చేయడానికి తగుదునా కాదా అని ఒక అనుమానం వచ్చి మా అమ్మగారి సహాయంతో శ్రీ శిరిడీ సాయిబాబా దగ్గర 'ఉద్యోగం చేయాలా? వద్దా? ఇటువంటి దైవ సంబంధమైన వృత్తుల్లోనే కొనసాగాలా? అన్న అనుమానంతో చీటీలు వేస్తే, 'ఉద్యోగం చేయవద్దు' అని వచ్చింది. అప్పటి నించి నేను ఏ ఉద్యోగ ప్రయత్నాలు చెయ్యలేదు. నామీద ఆధారపడిన వారిని పోషించుకోవడం కోసం భగవంతుడికి సంబంధించిన వృత్తిని ఎంచుకొని, దానిని కొనసాగిస్తూ, శ్రీ సాయి మాస్టర్ సత్సంగం చేసుకుంటూ బాబా మార్గంలోని ప్రయాణిస్తున్నాను. నా జీవితంలో ఇప్పటివరకు నాకై నేను సంకల్పించింది ఏదీ నెరవేరలేదు, బాబా సంకల్పమే నెరవేరింది.

సమర్థ సద్గురునైన శ్రీ సాయినాథుడే నా యజమాని. పూజ్యశ్రీ అమ్మగారు, పూజ్యశ్రీ మాస్టరుగార్లు నా తల్లిదండ్రులు! బెంగుళూరులో చింతామణి దగ్గరున్న హయత్ బాబా లాంటి మహాత్ముల సాంగత్యము, అనువాదము అనే తపస్సు, శ్రీ సాయిమాస్టర్ సత్సంగము, ఇంతటి అనుగ్రహం లభించిన నాకంటే అదృష్టవంతులెవరు? నాకంటే కోటీశ్వరులెవ్వరు? అనిపిస్తుంది. సాయినాథుని కృపాశీస్సులు నాపై ఎల్లప్పుడూ వుండాలని ప్రార్థిస్తున్నాను. ●

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

### శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

### శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

### ఇతర మహాత్ముల గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

### అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

### ధ్యాన సంబంధమైన గ్రంథములు

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

### ఆధ్యాత్మికత – తత్వచింతనా పూర్వక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

### ఇతర గ్రంథములు

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

### పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ<br>(రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి<br>(సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

### బాలల కొరకు విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master<br>*(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |


### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |











పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ తల్లి నాలుగవ ఆరాధనా మహోత్సవము తిథి ప్రకారము మే 21, 2025 బుధవారం నాడు గుమ్మళంపాడు గ్రామ శివారులో గల శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానము లో వైభవంగా జరిగింది. గురు పుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు ఉదయం దివ్య సన్నిధానంలోను, సాయంత్రం ఒంగోలులోని శ్రీ గురు భరద్వాజ నిలయంలోను సత్సంగం చేశారు.

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Printed and published by Dr. R.S. Sasidhar on behalf of E. Vikramaditya and printed at Vanaja Printers, Vijayawada and published at Sri Manga Bharadwaja Trust, Ongole (523002) - Editor: Dr. R.S. Sasidhar.
Postal Registration Number : Prakasam/16/2024-2026, Regd.No. 37926/83.











దివ్యజనని పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి నాలుగవ ఆరాధనా మహోత్సవము జూన్ 3, 2025 మంగళవారం నాడు, గుమ్మళంపాడు శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానము లో వైభవంగా జరిగింది. మాతృదేవి సమాధికి ప్రత్యేక అభిషేకము, అలంకరణ జరిగాయి. అనంతరము గురు పుత్రులు శ్రీ ద్వారకనాథ్ దంపతుల చే ప్రత్యేక పూజ జరిగింది. భక్తులందరూ కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. శ్రీ గురు పుత్రులు ఆరోజు రెండు పూటలా సత్సంగం చేశారు. సాయంత్రం ఒడియాలోకి అనువదించబడిన పూజ్య భరద్వాజ గురుదేవుల విరచితమైన శ్రీ స్వామి సమర్థ గ్రంథాన్ని ఆవిష్కరించారు.